

ఆర్థిక ఒత్తిడుల మధ్య కూడా కూటమి ప్రభుత్వం సుపరిపాలనతో ముందడుగు వేసింది. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తోంది. రూ.5 అన్న క్యాంటీన్, పెరిగిన పింఛన్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అమలవుతున్నాయి.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**



శనివారం 19.07.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 101 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


## సమస్యలు పార్లమెంటులో లేవనెత్తాలి



**రాష్ట్రాభివృద్ధికి నిధుల సాధనకు కృషి చేయండి**

**రాష్ట్రప్రాజెక్టులపై కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరపండి**

**టీడీపీపీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు, ప్రాజెక్టుల సాధనకు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంపీలకు సూచించారు. ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి నారా లోకేష్, ఎంపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... 'పార్లమెంట్ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలి. మిగతా 2లో...

# గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఏపీ

- ఏపీలో పరిశోధనలు చేయండి -పెట్టుబడులు పెట్టండి
- తక్కువ వ్యయంతో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయండి
- రెండు రోజుల్లో అమరావతి గ్రీన్ హైడ్రోజన్ డిక్లరేషన్
- గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- సదస్సులో ఇంధన రంగానికి చెందిన సీఈఓలు, ఎండీలతో సీఎం ముఖాముఖి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** హైడ్రోజన్ వ్యాలీగా ఆంధ్రప్రదేశ్ ను తయారు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గ్రీన్ హైడ్రోజన్ పై పరిశోధనలు చేయాలని, ఆ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. అందుకు తగిన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని సీఎం స్పష్టం చేశారు. శుక్రవారం అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించిన గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ లో ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబు హాజరై ప్రసంగించారు. గ్రీన్ హైడ్రోజన్ ను తక్కువ వ్యయంతోనే ఉత్పత్తి చేసేలా కొత్త సాంకేతికను అభివృద్ధి చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఈమేరకు యూనివర్సిటీలు, పరిశోధకులు ముందుకు రావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ అంశంపై సీఎం మాట్లాడుతూ.." గ్లోబల్ వార్మింగ్ దృష్ట్యా గ్రీన్ హైడ్రోజన్ ప్రాధాన్యం పెరిగింది. పర్యావరణ హితాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి పెద్ద ఎత్తున జరగాలి. 2070 నాటికి కర్బన రహిత ఇంధనాలు వాడాలన్నది మన జాతీయ లక్ష్యం. తక్కువ ఖర్చుతో హరిత విద్యుత్ తయారీ, స్టోరేజ్?పై దృష్టి సారించాలి. కేంద్రం కూడా గ్రీన్ హైడ్రోజన్? పరిశోధన, ఉత్పత్తికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. కొత్త ఆవిష్కరణలను అందిపుచ్చుకునేందుకు ఏపీ ఎప్పుడూ ముందు ఉంటుంది. ఇంధన ఖర్చు తగ్గాలి ప్రజలకు ప్రయోజనం చేకూరాలన్నదే ముఖ్యం. గ్రీన్ హైడ్రోజన్?తో అతి తక్కువ ఖర్చుతో విద్యుత్ ఇవ్వడం సాధ్యం. 2030 నాటికి 500 గిగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ తయారీ లక్ష్యంగా ప్రధాని నిర్ణయించారు. గ్రీన్ హైడ్రోజన్ తయారీ లక్ష్యంలో ఏపీ ప్రముఖ భాగస్వామిగా ఉంటుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**గ్రీన్ హైడ్రోజన్..గేమ్ ఛేంజర్ :** ఇంధన రంగంలో ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లను మిగతా 2లో...

## ఉప్పాడ తీరప్రాంత కోత సమస్యకు ..

# శాశ్వత పరిష్కారం

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఉప్పాడను చాలాకాలంగా వేధిస్తున్న తీర ప్రాంత కోత సమస్య రూ.323 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు ఎన్డీయే ప్రభుత్వం చురుకుగా పరిశీలిస్తోందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారు. పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడ ప్రాంతంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న సముద్ర తీర ప్రాంత కోత సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని పవన్ కల్యాణ్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్డీఎంఏ) ద్వారా ఉప్పాడలో తీర రక్షణ నిర్మాణాలను అభివృద్ధి చేసే ప్రతిపాదనను సుమారు రూ.323 కోట్ల అంచనా వ్యయంతో ఎన్డీయే కూటమి ప్రభుత్వం చురుకుగా పరిశీలిస్తోందని తెలిపారు. "గత ఐదేళ్లలో సగటున ఏటా 1.23 మీటర్ల తీరం కోతకు గురైంది, దీంతో సుమారు 12 మీటర్ల తీరం కోల్పోయింది. ఇది సమీప గ్రామాలపై, ముఖ్యంగా మత్స్యకారుల గృహాలపై తీవ్ర ప్రభావం చూపింది. ఎన్డీఏ ఎన్నికల వాగ్దానానికి కట్టుబడి, అవసరమైన అనుమతులు లభించిన వెంటనే నిర్మాణ పనులను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం" అని పవన్ కల్యాణ్ తెలిపారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం, ఎన్డీఎంఏ ద్వారా కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలను సమర్పించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను పరిశీలిస్తారని, హోం మంత్రి అమిత్ షా కాకినాడ ప్రజల ఆకాంక్షలను గుర్తిస్తారని ఆశిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉదారంగా సహకరిస్తున్న నేపథ్యంలో, ఈ ప్రాజెక్టు ఆమోదం పొంది, బాధితులకు వారు ఎప్పటి నుంచో కోరుకున్న ఊరట లభిస్తుందని పవన్ కల్యాణ్ తన ట్వీట్ లో ఆశాభావం వ్యక్తం చేశారు.

**పవన్ మాటిచ్చారు.. కేంద్రం సాకారం..:** రాష్ట్రంలో కూటమి సర్కార్ లో ప్రధాన భాగస్వామిగా ఉంటూనే ప్రజలకు తాను ఇచ్చిన హామీల్ని నిలబెట్టుకోవడంలో మాత్రం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎక్కడా వెనక్కి తగ్గడం లేదు. ముఖ్యంగా తనను తొలిసారి గెలిపించి అసెంబ్లీకి పంపిన పిఠాపురం నియోజకవర్గం విషయంలో అయితే అస్సలు రాజీపడటం లేదు. ఇదే క్రమంలో పవన్ కళ్యాణ్ పిఠాపురం పరిధిలోకి వచ్చే గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు.

ఏపీలో గత ఎన్నికల సమయంలో తాను పోటీ చేస్తున్న పిఠాపురం నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ఉప్పాడ గ్రామం వద్ద తీర ప్రాంతం భారీగా కోతకు గురవుతున్న విషయం పవన్ కళ్యాణ్ దృష్టికి వచ్చింది. దీంతో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి తీర ప్రాంతం కోతకు గురి కాకుండా కాపాడతామంటూ పవన్ హామీ ఇచ్చారు. ఈ మేరకు కేంద్రం వద్దకు ఇక్కడ తీర ప్రాంత రక్షిత గోడ కట్టాలని ప్రతిపాదనలు తయారు చేయించి పంపారు.

ఉప్పాడ వద్ద తీర ప్రాంతం కోతకు గురవుతుండటంతో ఈ గ్రామ ప్రజల ఇళ్లు సముద్రంలో కలిసి పోతున్నాయి. అంతే కాదు సముద్రం ఎప్పుడు మిగతా 2లో...

# రాబడి పెంచాలి..



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** మన రాష్ట్రంలో పనిచేస్తున్న వాణిజ్య పన్నుల శాఖఅధికారుల పనితీరు దేశానికే ఆదర్శమని వారు పనితీరులో ఎవ్వరికీ తీసిపోరని ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. శుక్రవారం తాడేపల్లి లోని రాష్ట్ర వాణిజ్య పన్నుల సంస్థ కార్యాలయంలో జేసీ, డీసీ (జాయింట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ లు) లతో ఏర్పాటు చేసిన రెవెన్యూ వర్క్ షాపు కార్యక్రమానికి ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ తమ అనుభవాన్ని ఉపయోగించి సంస్థ మరింత పురోభివృద్ధి చెంది ఆదాయాన్ని ఆర్జించేలా కృషి చేయాల్సిన ఆవశ్యకత మనందరి పై ఉందని మంత్రి అన్నారు. అధికారులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని వ్యాపారాలు చేసుకొనే ఏ ఒక్కరికీ ఇబ్బందులు కలగకుండా జీఎస్టీ పన్నుల రెవెన్యూను పెంచాలన్నారు. ఇందులో ఏ ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వ పరంగా అధికారులకు అండగా ఉంటామని తెలిపారు. ప్రభుత్వానికి రాష్ట్రంలో పెట్టుబడులు ఎంతముఖ్యమో అదే విధంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కూడా అంతే ముఖ్యమన్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈఏడాది పన్నుల వసూళ్లలో వృద్ధి సాధించామని ఇందుకు టీమ్ గా పనిచేసిన సిబ్బందిని అభినందిస్తున్నానన్నారు. ఇదే స్ఫూర్తిని మున్ముందు కూడా కొనసాగించాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఏర్పడి మిగతా 2లో...

## పట్టాభిరాం పుస్తకావిష్కరణ



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ప్రముఖ సైకాలజిస్ట్, రచయిత డాక్టర్ బీవీ పట్టాభిరాం జీవితానుభవాలతో రచించిన 'జీవితం ఒక ఉత్సవం - నా బతుకు కథ' పుస్తకాన్ని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం విజయవాడలోని ఐఎంఎ హాల్‌లో విజయవాడ బుక్ ఫెస్టివల్, ఎమెస్కో సంయుక్తంగా నిర్వహించగా, మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ పుస్తకం డాక్టర్ డి. చందశేఖర్ రెడ్డి, జి. వల్లీశ్వర్ సంపాదకత్వంలో వెలువడింది. ఆవిష్కరణ కార్యక్రమంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. కృష్ణమోహన్, మాజీ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, రచయిత డాక్టర్ యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్, ఎమెస్కో ప్రతినిధి విజయకుమార్, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, పట్టాభిరాం కుమారుడు ప్రశాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ మిగతా 2లో...

## రూల్ ఆఫ్ రిజర్వేషన్ పై సమాలోచన



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పై మంత్రుల కమిటీ సమావేశమైంది. శుక్రవారం నాడు వెలగపూడి సచివాలయంలో మంత్రులు డోలా బాల వీరాంజనేయస్వామి, గుమ్మడి సంధ్యారాణి, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, పలువురు ఉన్నతాధికారులు సమావేశమై చర్చించారు. ఈ సంధర్భంగా ఇతర రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు తీరు, పలు కేసుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పై న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులపైనా సమావేశంలో సుధీర్ఘంగా చర్చించారు. ఈ అంశంపై మరొకసారి సమావేశం కావాలని మంత్రుల కమిటీ నిర్ణయించింది. ఈ అంశంపై మరింత అధ్యయనం చేసి ఎవరికి ఇబ్బందులు లేకుండా నిర్ణయం తీసుకుంటామని మంత్రుల కమిటీ తెలిపింది.

## సైబర్ క్రైమ్స్ పై ఉక్కుపాదం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** సైబర్ క్రైమ్స్ పై ఉక్కుపాదం మోపే విధంగా ప్రస్తుతం ఉన్న చట్టానికి మరింత పదును పెట్టే విధంగా వచ్చే శాసన సభా సమావేశాల్లో చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు ఆంధ్రప్రదేశ్ శాసనసభ పిటిషన్ల కమిటీ అభిప్రాయ పడుతున్నట్లు ఆ కమిటీ చైర్మన్ మరియు ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె. రఘు రామకృష్ణరాజు తెలిపారు. పటిష్టమైన చట్ట రూపకల్పనకు హోం, ఐటి శాఖ కార్యదర్శులతో నేడు జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ పిటిషన్ల కమిటీ సమావేశంలో సమగ్రంగా చర్చించడం జరిగిదని ఆయన తెలిపారు. శుక్రవారం రాష్ట్ర శాసన సభ భవనంలోని తమ ఛాంబరులో కమిటీ సభ్యులు అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖపట్నం ఉత్తర ఎమ్మెల్యే పి విష్ణు కుమార్ రాజు మరియు చిత్తూరు శాసన సభ్యులు గురజాల జగన్మోహన్ తో కలసి ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడిచేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుచున్న సైబర్ క్రైమ్స్ నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే పలు మిగతా 2లో...

## పలు వక్ఫ్ ఆస్తులను పరిశీలన




**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ శుక్రవారం పలు వక్ఫ్ ఆస్తులను పరిశీలించారు. ముందుగా విజయవాడ లోని కాళేశ్వరరావు మార్కెట్ వద్ద గల ముసాఫిర్ ఖానా ను పరిశీలించారు. అక్కడి పరిస్థితుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఆదాయం పెరిగే విధంగా తీసుకోవాల్సిన చర్యలను సూచించి తక్షణమే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి గ్రామంలోని 3.21 ఎకరాల వక్ఫ్ భూమిని పరిశీలించారు. ప్రస్తుతం అందులో 1.4 ఎకరాల భూమి ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, స్థానిక ప్రాధాన్యం మరియు భవిష్యత్తు అవకాశాలు దృష్టిలో పెట్టుకొని సదరు భూమి నందు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు నిర్ణయించామని, వక్ఫ్ బోర్డ్ కు స్థిరమైన ఆదాయం పెరిగే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారితో పాటు వక్ఫ్ బోర్డ్ సభ్యులు అక్రమ్, సీఈవో మొహమ్మద్ అలీ, వక్ఫ్ బోర్డ్ అధికారులు, మాజీ కార్పొరేటర్ ఫతాఉల్లా ఉన్నారు.

## జగన్‌తో ఏపీకి తీరని అన్యాయం

- జగన్‌కు తలకాయకు, మామిడికాయకు తేడా తెలియకుండా ఉంది
- వైసీపీ పాలనలో ఏపీ దారుణంగా నష్టపోయిందన్న నిమ్మల రామానాయుడు
- వైసీపీ నుంచి ప్రజలను కాపాడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని వ్యాఖ్య

2లో



### ఉప్పాడ తీరప్రాంత కోత సమస్యకు ..

# శాశ్వత పరిష్కారం



(మొదటి పేజీ తరువాయి)

వచ్చి తమ ఇళ్లను ముంచేస్తుందో, తనలో కలిపేసుకుంటుందో తెలియక ఇక్కడి మత్స్యకారులకు నిద్రపట్టడం లేదు. ఈ సమస్యను గమనించిన పవన్ కళ్యాణ్ కేంద్రానికి ఉప్పాడ వద్ద రక్షణ గోడ నిర్మాణం కోసం రూ.323 కోట్లు కేటాయించాలని ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు పవన్ కళ్యాణ్ పంపిన విజ్ఞప్తికి కేంద్రం కూడా సానుకూలంగా స్పందించింది.

ఉప్పాడ తీర ప్రాంత కోత నివారణకు శాశ్వత పరిష్కారం!!:

తాజాగా పవన్ కళ్యాణ్ పంపిన ఉప్పాడ రక్షిత గోడ నిర్మాణానికి అవసరమైన రూ.323 కోట్ల నిధుల కేటాయింపుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు జనసేన పార్టీ తన 'ఎక్స్' హ్యాండిల్ ఈ విషయాన్ని సంతోషంగా షేర్ చేసింది. కేంద్రం ఇచ్చే నిధులతో ఉప్పాడ వద్ద రక్షిత గోడ నిర్మాణం జరిగితే ఇక అక్కడ గ్రామానికి సముద్ర ముప్పు తొలగిపోతుంది. ముఖ్యంగా తుఫానులు వచ్చినప్పుడు, సముద్ర ఆటుపోట్లకు సైతం తీరం కోతకు గురికాకుండా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# పట్టాభిరాం పుస్తకావిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

"పట్టాభిరాం బహుముఖ ప్రతిభ కలిగిన వ్యక్తి. రచయితగా, కౌన్సిలర్‌గా, సైకాలజిస్ట్‌గా ఎన్నో జీవితాల్లో వెలుగురేశాడు. ఆయన సాధించిన విజయాలను భావితరాలకి చేరవేయాల్సిన అవసరం ఉంది" అని అన్నారు. సైకాలజీలో ఆసక్తి పెరుగుతున్న తరుణంలో రాష్ట్రంలో క్లినికల్ సైకాలజిస్టులు, సైకాలజిస్ట్‌ల కొరత ఉందని పేర్కొంటూ, "వచ్చే విద్యా సంవత్సరం నుంచి సైకాలజీలో వివిధ విభాగాల్లో 30 సీట్లు అందుబాటులోకి తీసుకురాబోతున్నాం" అని తెలిపారు. అలాగే భవిష్యత్‌లో సైకాలజిస్ట్‌లు, సైక్రియాట్రిస్ట్‌లకు ఇచ్చే అవార్డును బీవీ పట్టాభిరాం పేరుతో అందజేస్తామన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా పట్టాభిరాంకు పద్మశ్రీ బిరుదు అందించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానన్నారు. "నేను రాసిన 'ట్రూలీ స్పీకింగ్ ఇంగ్లీష్' పుస్తకాన్ని త్వరలో ఎమెస్కో ద్వారా విడుదల చేయనున్నాను" అని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమం పట్టాభిరాం సాహితీ, మానసిక సేవలకు అంకితభావంతో నిర్వహించబడింది.

# జగన్‌తో ఏపీకి తీరని అన్యాయం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** 2014లో జరిగిన రాష్ట్ర విభజన వల్ల ఏపీ చాలా నష్టపోయిందని... రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆ తర్వాత 2019 నుంచి 2024 మధ్య వైసీపీ పాలనలో అత్యంత దారుణంగా నష్టపోయిందని ఆరోపించారు. వెంటిలేటర్ పై ఉన్న రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం రక్షించే ప్రయత్నం చేస్తోందని అన్నారు. పురాణాలలో రాక్షసుల నుంచి ప్రజలను కాపాడినట్టుగా... ఇప్పుడు వైసీపీ నుంచి ప్రజలను కాపాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.

జగన్ చేస్తున్న వ్యాఖ్యలను చూస్తే... ఆయనకు తలకాయకి, మామిడికాయకి తేడా తెలియకుండా ఉందని ఎద్దేవా చేశారు. బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్, బెట్టింగ్ రాయుళ్లను జగన్ పరామర్శిస్తున్నారని మండిపడ్డారు. వైనాట్ 175 అన్న జగన్ కు ప్రజలు ఎలా బుద్ధి చెప్పారో చూశామని అన్నారు. జగన్ పాలనలో అనేకమంది పారిశ్రామికవేత్తలు రాష్ట్రాన్ని విడిచి వెళ్లిపోయారని గుర్తు చేశారు. మళ్లీ జగన్ అధికారంలోకి రాడన్న నమ్మకంతోనే పారిశ్రామికవేత్తలు తిరిగి ఏపీ వైపు చూస్తున్నారని అన్నారు.

నాడు పోలవరం గురించి అర్థం కాలేదన్న వైసీపీ మంత్రులు... ఇప్పుడు పోలవరం గురించి మాట్లాడుతుండటం ఆశ్చర్యంగా ఉందని నిమ్మల ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని ధ్వంసం చేసిన నాయకులు ఇప్పుడు మాట్లాడటం సిగ్గుచేటుగా ఉందని అన్నారు. 2027 నాటికి పోలవరంను పూర్తి చేస్తామని తెలిపారు.

గత ప్రభుత్వం హంద్రీనీవాను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని... తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రాజెక్ట్ ను పూర్తి చేసి నీటిని విడుదల చేశామని చెప్పారు. సీడబ్ల్యూసీ అనుమతులతో త్వరలోనే బనకచర్ల ప్రాజెక్టును ప్రారంభిస్తామని తెలిపారు. గోదావరి నుంచి ప్రతి ఏటా 3 వేల టీఎంసీల నీరు సముద్రంలోకి వృథాగా పోతున్నా... జగన్ మాత్రం మిగులు జలాలు లేవని కామెంట్ చేయడం దారుణమని అన్నారు.

# ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్-3 టెండర్ దశకు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగర అభివృద్ధికి ఎంతో కీలకమైన ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్-3 నిర్మాణం తుది దశకు చేరుకుంది. రూ.48 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టు పనులకు సంబంధించిన ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటిఫికేషన్ విడుదలైంది. జూలై 18 నుంచి ఆగస్టు 1 వరకు టెండర్ దాఖలుకు గడువు ఇవ్వబడింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, "ఇది కేవలం రహదారి కాదు. గుంటూరుకు అభివృద్ధి దిశగా మలుపు తిప్పే మార్గం. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నందుకు ఆనందంగా ఉంది" అని పేర్కొన్నారు. ఫేజ్-3 రహదారి నిర్మాణం పూర్తయిన తర్వాత జెకెసీ కాలేజీ రోడ్ (స్వర్ణభారతి నగర్) నుంచి పెదపలకలూరు రోడ్ వరకు బహుళ సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రహదారి ప్రాజెక్టు సమాప్తమవుతుంది. ఇది ముఖ్యంగా పల్నాడు ప్రాంతం నుంచి వచ్చే వాహనాలను గుంటూరు నగరానికి ముందు నుంచే మళ్లించేందుకు ఉపకరిస్తుంది. ప్రాజెక్టు వేగవంతంగా సాగేందుకు అవసరమైన అనుమతులు సీఆర్డీఏ నుంచి పొందారు. భూ స్వాధీనం, నష్టపరిహారం వంటి సవాళ్లను అధిగమించేందుకు చర్యలు తీసుకున్నారు. బాధితులకు రూ.6.73 కోట్ల నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టారు. ఈ ప్రాజెక్టు విజయవంతంగా సాగేందుకు సహకరించిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, సీఆర్డీఏ, జీఎంసీ అధికారులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇన్నర్ రింగ్ రోడ్ పూర్తి అయితే గుంటూరు నగర రవాణా వ్యవస్థ మరింత సమర్థవంతంగా మారుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రజలకు వాహన రాకపోకల్లో భారీ ఊరట కలిగిస్తుందని తెలిపారు.

# గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

అధిగమించేలా పరిశోధనలు చేసి పరిష్కారం అన్వేషించాలని పరిశోధకులకు సీఎం పిలుపునిచ్చారు. సంప్రదాయ ఇంధన వనరుల కారణంగా తీవ్రమైన కాలుష్యం బారిన పడుతున్నామని నెట్ జీరో కార్బన్ లక్ష్యాల సాధనకు గ్రీన్ హైడ్రోజన్ లాంటి ఇంధనమే సరైన పరిష్కారమని సీఎం అన్నారు. ఇక సమీప భవిష్యత్ అంతా గ్రీన్ హైడ్రోజన్‌దేనని.. ఇంధన రంగంలో అది గేమ్ ఛేంజర్ గా మారుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అయితే తక్కువ ఖర్చుతో సామాన్యులు కూడా వ్యయం భరించేలా ఉండే దీనిని ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. ఏపీలోనూ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించామని ముఖ్యమంత్రి వెల్లడించారు. విశాఖలో ఎన్టీపీసీ సంస్థ గ్రీన్ హైడ్రోజన్ తయారు చేసేందుకు ప్లాంట్ ను ఏర్పాటు చేస్తోందని అన్నారు. అలాగే కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కూడా త్వరలోనే ప్రారంభం అవుతుందన్నారు. 160 మెగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని ఏపీ




నిర్దేశించుకుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 3 గిగావాట్ల సామర్థ్యంతో ఎలక్ట్రోలైజర్ల ద్వారా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తితో పాటు ఏపీలో సౌర, పవన, పంప్డ్ విద్యుత్ ఉత్పత్తికి అపారమైన వనరులు ఉన్నాయని స్పష్టం చేశారు. అమరావతిలో కృత్రిమ మేథ కేంద్రంగా క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేస్తున్నామని.. రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగానూ తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి అన్నారు. రెండు రోజుల సదస్సు అనంతరం అమరావతి గ్రీన్ హైడ్రోజన్ డిక్లరేషన్ ను ప్రకటిస్తామని.. ఏడాది తర్వాత డిక్లరేషన్ అమలు పై సమీక్షిస్తామని సీఎం వెల్లడించారు.

**గ్రీన్ హైడ్రోజన్ , గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి సీఎం సమక్షంలో రూ.51 వేల కోట్లకు ఒప్పందాలు :** ఏపీలో గ్రీన్ హైడ్రోజన్ , గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేసేందుకు రెండు సంస్థలు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సదస్సు వేదికగా ట్రాన్స్‌ఫర్మేటివ్ అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకున్నాయి.

ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం- ఆయా సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. యూకేకు చెందిన యమ్నా సంస్థ రూ.16 వేల కోట్ల పెట్టుబడితో నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వద్ద ఏడాదికి 1 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ ను ఏర్పాటు చేసేందుకు ఎంఓయూ కుదుర్చుకుంది. అలాగే కేఎస్ఏహెచ్ ఇన్ఫ్రా సంస్థ మచిలీపట్నంలో 150 కిలోటన్నుల సామర్థ్యంతో గ్రీన్ హైడ్రోజన్ , 600 కిలోటన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. దీనికోసం రూ.35 వేల కోట్ల రూపాయల్ని పెట్టుబడి పెట్టనుంది. అంతకుముందు సదస్సులో భాగంగా ఇంధన రంగానికి చెందిన వివిధ సంస్థల సీఈఓలు, ఎండీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖాముఖి భేటీ అయ్యారు. ఈ సదస్సుకు నీతి ఆయోగ్ సభ్యుడు వి.కె.సారస్వత్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు.

# రాబడి పెంచాలి..



(మొదటి పేజీ తరువాయి)

ఏడాది కాలం పూర్తి అయ్యిందని ఇంకా మరింత బాధ్యతాయుతంగా అధికారులు, సిబ్బంది పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నెలలోపు శాఖ ప్రగతిలో మార్పులు తప్పనిసరిగా కనిపించాలన్నారు.

మన డాటాని ఆధారం చేసుకుని వ్యవస్థలో లోపాలతో పన్నులను ఎగ్గొట్టేవారికి మనం అంటే చూపించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు పనిచేస్తున్నారన్నారు. అదే స్ఫూర్తిని తీసుకుని నేను కూడా ఎంతో ఇష్టంగా పనిచేస్తున్నానన్నారు. ఇదే స్ఫూర్తితో ఉద్యోగులు కూడా సమర్థవంతంగా తమ సేవలను రాష్ట్రాభివృద్ధి కోసం ఉపయోగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 5 సంవత్సరాల యాక్షన్ ప్లాన్ తో ముందుకు వెళ్లుతుందన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రంలోకి అక్రమంగా వచ్చే ఆయిల్ తదితర దిగుమతులు చేసుకునే వాళ్లు పన్ను వసూళ్లు నుంచి తప్పించుకోకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వాటిని సమర్థవంతంగా అరికట్టాలన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్స్ ను సమర్థవంతంగా అరికట్టే విధంగా ఇతర శాఖలతో కలసి జాయింట్ కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేసుకుని సంయుక్తంగా తనిఖీలతో వాటిని సరిచేయాలన్నారు. ఫీల్డ్ లో సమర్థవంతంగా పనిచేసినప్పుడే మనం ఆశించిన రిజల్ట్స్ వస్తాయన్నారు. గత ప్రభుత్వం విధానాల వల్ల ఆర్థిక ఇబ్బందులు మన ప్రభుత్వానికి అందించిందని, వాటిని సరిచేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వ్యాట్ పన్నులు పెంచేందుకు పనిచేసిన వారికి అవార్డులు అందిస్తామని మంత్రి తెలిపారు. యానాం నుంచి మన రాష్ట్రానికి డీజిల్ దిగుమతి అవుతుందనే సమాచారం ఉందని అలాంటి వాటిపై అధికారులు దృష్టి సారించాలని మంత్రి అధికారులకు సూచించారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న పెండింగ్ రెవెన్యూ వసూళ్లను వసూలు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సిస్టమ్ లో ఉన్న లోపాలను ఉపయోగించుకుని పన్ను ఎగ్గొట్టే వారిని నుంచి పన్ను వసూలు చేస్తే రెవెన్యూ పెరుగుతుందన్నారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్ మాట్లాడుతూ అధికారులు క్లోజ్ గా మోనటరింగ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. జీఎస్టీ ఫైలింగ్ అప్పుడు చేసిన డేటా మనకు ఉపయోగపడుతుందన్నారు. అధికారుల అనుభవం శాఖ రెవెన్యూ పెరిగేలా ఉపయోగపడుతుందన్నారు. దేశంలో వేరే రాష్ట్రాలతో పోల్చుకుంటే మన వాణిజ్య పన్నుల శాఖ పనితీరు చాలా మెరుగ్గా ఉందన్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని చాలా స్మార్ట్ గా పనిచేయాలన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి రెవెన్యూ రాబడులు పెరగాల్సి ఉందన్నారు.

రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ బాబు ఏ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సమాచారం మరియు ఆన్ లైన్ సమాచారాన్ని ఉపయోగించుకుని రెవెన్యూ రాబడులను పెంచడం జరిగిందన్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది రెవెన్యూ వసూళ్లు బాగా పెరిగాయన్నారు. ఇది టీమ్ వర్క్ గా సిబ్బంది అందరూ పనిచేయడం వల్లే సాధ్యపడిందన్నారు. ఏరోజుకారోజు ప్రత్యేక కార్యాచరణతో, పనితీరు సూచికలతో రెవెన్యూ రాబడి పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. వాణిజ్య పన్నుల శాఖ యొక్క అవిశ్రాంత మరియు వినూత్న ప్రయత్నాల కారణంగా జూన్ 2025 లో నికర GST వసూళ్లలో 7.10% వృద్ధిని సాధించిందని బాబు ఏ తెలిపారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ మరియు కార్యదర్శి రవి శంకర్, రాష్ట్ర పన్నుల ప్రత్యేక కార్యదర్శి సౌమ్య నూతలపాటి, రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ డి. రమేష్, రాష్ట్రంలో ఉన్న వాణిజ్య పన్నుల శాఖకు చెందిన జాయింట్ కమిషనర్లు (జేసీ),డీసీ లు, తదితరలు పాల్గొన్నారు.

# సైబర్ క్రైమ్స్ పై ఉక్కుపాదం



(మొదటి పేజీ తరువాయి)

ఆదేశాలు జారి చేయడం జరిగిందని, వారి ఆదేశాల మేరకు ఈ అంశంపై ఆంధ్రప్రదేశ్ శాసనసభ పిటిషన్ల కమిటీ కూడా ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. బెట్టింగ్ యాప్స్, లోన్ యాప్స్ వల్ల రాష్ట్రంలోని ఎంతో మంది అమాయకులు మోసపోతున్నారని, వీటికి సంబందించి కేవలం 4 శాతం కేసులు మాత్రమే రిజిస్టరు అయ్యాయని, మొత్తం రూ.960 కోట్లు మేర మోసం జరిగిందని, ఇందులో రూ.300 కోట్ల వరకూ రికవరీ చేయడం జరిగిందని గత ఏడాది నివేదికలు వెల్లడిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ లెక్కన ఏడాది దాదాపు రూ.30 వేల కోట్ల వరకూ సైబర్ క్రైమ్ మోసాలు జరుగుచున్నట్లు ఆయన తెలిపారు. మోస పూరిత యాప్స్ ను రూపొందించే వారిపై మరియు సిస్టమ్స్ లో వాటిని లోడ్ చేసేవారిపై కేసులు పెట్టే అవకాశం ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం లేదని, అయితే ఆ చట్టానికి సవరణ చేయడం ద్వారా గ్రాస్ రూట్ లెవిల్ లో క్రైమ్ సిండికేట్ మొత్తాన్ని నియంత్రించే విధంగా నూతన చట్టాన్ని తీసుకురానున్నామన్నారు. ఇందుకు సంబందించి సమగ్రమైన నివేదికను తమ కమిటీ త్వరలో శాసన సభ స్పీకర్ కు నివేదిదించనున్నట్లు ఆయన తెలిపారు.

డిజిటల్ అరెస్టు చేసినట్లు మోసపూరితమైన కాల్స్, సందేశాలు రావడం వల్ల ఎంతో మంది అమాయకులు భయభ్రాంతులకు గురై ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్న సంఘటనలు సమాజంలో చోటు చేసుకుంటున్నాయన్నారు. అసలు డిజిటల్ అరెస్టు అనే విధానమే లేదని, ఇటు వంటి మోసపూరితమైన కాల్స్, సందేశాలకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఇటు వంటి మోసాలకు సంబందించిన సమాచారాన్ని 1930 కు వెంటనే ఫిర్యాదు చేసినట్లైతే తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 40 మంది ఆపరేటర్లు మూడు షిఫ్టుల్లో పనిచేసే విధంగా సి.ఐ.డి. శాఖ కాల్ సెంటర్ ను నిర్వహించడం జరుగుచున్నదని ఆయన తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సినీ ప్రముఖులతో పలు మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయించే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లనున్నామని, ఏడాది కాలంలో ఈ సైబర్ క్రైమ్స్ ను పూర్తి గా అరికట్టే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలనేది తమ కమిటీ యొక్క ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. వాట్సాప్ గవర్నెన్సు కూడా ఎంతో పారదర్శకంగా పనిచేస్తున్నదని, లక్ష్యానికి మించి దాదాపు 10 లక్షల ట్రాన్సాక్షన్స్ ఈ వాట్సాప్ గవర్నెన్సు ద్వారా జరిగాయని, ఈ ప్లాట్ ఫార్మ్ ద్వారా కూడా సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ పిటిషన్ల కమిటీ సభ్యులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యంగా నాలుగు రకాలైన సైబర్ క్రైమ్స్ ద్వారా ప్రజలను మోసగించడం జరుగుచున్నదన్నారు. తక్కువ వడ్డీ ఋణాల యాప్స్, బెట్టింగ్ యాప్స్, కాల్ సెంటర్ల ద్వారా పోర్న్ వీడియోలు, లింకులు పంపించడం మరియు బ్యాంక్ ఓటిపి లను అడగం ద్వారా సైబర్ మోసాలు జరుగుచున్నాయన్నారు. ఇటు వంటి నేరాలను నియంత్రించేందుకు ప్రభుత్వం తన వంతు కృషి చేస్తున్నదని, అయితే ప్రజలు కూడా వీటి విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరస్తుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన ఆయన కోరారు. అంతకు ముందుకు శాసన సభ కమిటీ హాల్లో చైర్మన్ మరియు ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె. రఘు రామకృష్ణ రాజు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ పిటిషన్ల కమిటీ సమావేశంలో శాసన సభ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, డిప్యూటీ సెక్రటరీ కె.రాజకుమార్, కమిటీ సభ్యులు & శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ, పల్లా శ్రీనివాసరావు, పి విష్ణు కుమార్ రాజు, గురజాల జగన్మోహన్, కుమార్ విశ్వజిత్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పార్లమెంటులో లేవనెత్తాలి

(మొదటి పేజీ తరువాయి)

రైతులకు మద్దతు ధర, నదీ జలాలు, పారిశ్రామికీకరణ వంటి అంశాలను పార్లమెంట్ లో లేవనెత్తాలి. ఆయా అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలను వివరించడంతో పాటు కేంద్రం నుంచి ఆశిస్తున్న సాయాన్ని పార్లమెంట్ ద్వారా కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి.' అని సీఎం చంద్రబాబు అన్నారు.

**మన ఎంపీల పనితీరు బాగుంది :** 'పార్లమెంట్‌లో మన ఎంపీల పని తీరు బాగుంది. క్రమం తప్పకుండా సమావేశాలకు హాజరవుతున్నారు. చర్చించే అంశాలపై రాష్ట్ర వాదనను సమర్థవంతంగా వినిపిస్తున్నారు. పార్లమెంట్ సభ్యుల హాజరులో దేశవ్యాప్తంగా సగటున 85 శాతం ఉండగా టీడీపీ సభ్యులది 86.2 శాతం హాజరుతో అగ్రస్థానంలో ఉన్నారు. చర్చల్లో పాల్గొనడం, ప్రశ్నలు అడగటంలోనూ తెలుగుదేశం ఎంపీలు తొలి స్థానంలో ఉన్నారు. పార్లమెంట్‌లో రాష్ట్రానికి సంబంధించిన అంశాలను ప్రస్తావించడంతో పాటు ప్రధాని మోదీ చేస్తున్న మంచి పనులను కూడా సభలో ప్రస్తావించాలి. సరైన సమయంలో సరైన వ్యక్తి ప్రధానిగా ఉన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో టెర్రరిస్టులకు గట్టి సమాధానం ఇచ్చారు. ఆపరేషన్ సిందూర్, ఎమర్జెన్సీకి 50 ఏళ్లు వంటి అంశాలపై జరిగే చర్చలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరును సమర్థించాలి' అని సీఎం సూచించారు.

**రాష్ట్ర సమస్యలపై నిరంతరం సంప్రదింపుల జరపాలి:** 'ఎంపీలకు కొన్ని శాఖల వారీగా బాధ్యతలు అప్పజెప్పాం. మీకు కేటాయించిన విభాగాలకు సంబంధించిన సమస్యలు, పెండింగ్ అంశాలపై కేంద్రమంత్రులతో నిరంతరం మాట్లాడాలి, రాష్ట్ర యంత్రాంగంతోనూ సమన్వయం చేసుకోవాలి. నిరంతరం సంప్రదింపులు జరపడం వల్లే నరేగాకు సంబంధించి రూ.180 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ బిల్లులను తిరిగి ప్రక్రియలో పెట్టగలిగాం. ఇదే విధంగా జల్ జీవన్ మిషన్, ఆరోగ్య మిషన్ వంటి పథకాలపైనా దృష్టిపెట్టి అదనపు నిధుల సాధనకు కృషి చేయాలి. అలాగే ప్రతి అంశంపై ఎంపీలు పూర్తి అవగాహన కలిగి ఉండాలి, సమాచారాన్ని సిద్ధంగా ఉంచుకోవాలి. జరిగే రాజకీయ పరిణామాలపై ఎప్పటికప్పుడు దృష్టిపెట్టాలి. నేను కచ్చితమైన సమాచారంతో ఉండబట్టే ఢిల్లీలో జరిగిన తెలుగురాష్ట్రాల సీఎంల సమావేశంలో రాష్ట్రానికి మేలు కలిగేలా వాదనలు వినిపించగలిగాను.



**ప్రజలతో మరింత మమేకమవ్వండి :** 'రాష్ట్రం సంక్షోభంలో ఉన్న సమయంలో ప్రజలు మనకు ఓట్లు వేసి అధికారం ఇచ్చారు, పెద్ద సంఖ్యలో ఎంపీలను ఇచ్చారు. దీన్ని మనం రాష్ట్రాభివృద్ధి కోసం వినియోగించుకోవాలి. ఎంపీలు ప్రజలతో మమేకమై పని చేయాలి. అనవసర విషయాల్లో ఎంపీలు ఎక్కడా జోక్యం చేసుకోవద్దు. వన్ టైం ఎంపీలుగా ఉండేలా ప్రవర్తించవద్దు. ప్రజలు పెట్టుకున్న ఆకాంక్షల మేరకు మీరు పని చేయాలి. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మన రాష్ట్రానికి ప్రధాని మోదీ మూడు సార్లు రాష్ట్రానికి వచ్చారు. యోగాంధ్ర వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పాల్గొన్నారు. వీటిని మనం విజయవంతం చేశాం. జాతీయ స్థాయిలో రాష్ట్ర ఇమేజ్ పెరిగింది. దీన్ని మనకు అనుకూలంగా మలుచుకోవాలి. మామిడి రైతులకు కేంద్రం నుంచి అందాల్సిన సాయం వచ్చేలా చూడాలి. పల్ప్ పరిశ్రమలకు జీఎస్టీ తగ్గించే అంశంపైనా సంప్రదింపులు జరపాలి. ఇటీవల ఏపీలో జరిగిన పరిణామాలను వివరించాలి. రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతిని పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లాలి. సమయానుకూలంగా వ్యవహరించి సభలో క్వాంటమ్ వ్యాలీ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, జనాభా నిర్వహణ, పీ4 వంటి అంశాలను వివరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇదే సమయంలో నేరపూరిత రాజకీయ అంశాల ప్రస్తావన వచ్చినప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను వివరించాలి.' అని అన్నారు.

**క్రిమినల్స్‌తో రాజకీయం చేయాల్సివస్తోంది :** ఎంపీలతో సమావేశం సందర్భంగా సీఎం చంద్రబాబు ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలను ప్రస్తావించారు. క్రిమినల్స్ రాజకీయాల్లోకి వస్తే ఎలా ఉంటుందనేది జగన్ ప్రవర్తనతో అర్థమవుతోందని చెప్పారు. 'జగన్ కారుకింద పడి తన భర్త చనిపోయాడని సింగయ్య భార్య ఫిర్యాదు చేస్తే... ఆ కేసులో నిందితుడిగా ఉన్న జగన్ సింగయ్య కుటుంబాన్ని పరామర్శ పేరుతో తన ఇంటికి పిలిపించుకుని 'లోకేష్ తనకు కోటి రూపాయలు ఇస్తానని ఆశచూపారు...అందుకే కేసు పెట్టాను' అని బెదిరించి మరీ ఆమెతో చెప్పించారు. వివేకా హత్య సమయంలోనూ ఇదే తరహా డ్రామా ఆడారు. వివేకా చనిపోయారని నేను బాధపడితే నాపైనే ఆరోపణలు చేశారు. నారాసుర రక్త చరిత్ర అంటూ కథనాలు రాశారు. సీఎంగా ఉన్న నాపైనే హత్యారోపణలు చేసే ధైర్యం చేశారంటే ఎంత బరితెగించినవాళ్లో అర్థం చేసుకోవాలి. మన దురదృష్టం కొద్దీ అలాంటి వాళ్లతో రాజకీయం చేయాల్సి వస్తోంది. ఇలాంటి విషయాలను దృష్టిలో పెట్టుకుని ఎంపీలుగా మీరూ అప్రమత్తంగా ఉండి ప్రజలను చైతన్యం చేయాలి' అని సీఎం ఎంపీల సమావేశంలో అన్నారు. ఢిల్లీలో తెలుగు రాష్ట్రాల సీఎంల సమావేశ అంశాలను ఎంపీలకు ముఖ్యమంత్రి వివరించారు.

# ఆర్సీబీ అతివల్లే 'చిన్నస్వామి' తొక్కిసలాట





## కర్ణాటక హైకోర్టుకు సర్కారు నివేదిక

**బెంగళూరు, జూలై 18:** బెంగళూరులోని చిన్న స్వామి స్టేడియంలో జరిగిన విజయోత్సవ సభకు పోలీసుల అనుమతి తీసుకోకుండానే ప్రజలను ఆర్సీబీ ఆహ్వానించినట్లు కర్ణాటక ప్రభుత్వం తెలిపింది. జూన్ 4న జరిగిన తొక్కిసలాట ఘటనపై హైకోర్టుకు కర్ణాటక ప్రభుత్వం నివేదిక సమర్పించింది. 2009 నాటి నగర ఉత్తర్వుల ప్రకారం, పబ్లిక్ ఈవెంట్స్‌కు ముందుగా పోలీసుల నుంచి అధికారిక అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఆర్సీబీ కేవలం పోలీసులకు సమాచారం మాత్రమే ఇచ్చింది. అనుమతి కోరలేదు. అందుకే పోలీసులు అనుమతి నిరాకరించారు. అయితే పోలీసులను సంప్రదించకుండానే ఆర్సీబీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో విక్టరీ పరేడ్ గురించి పలుమార్లు పోస్టు పెట్టింది. జూన్ 4న ఉదయం 7:01 గంటలకు తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ఆ తర్వాత ఉదయం 8 గంటలకు మళ్లీ ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. ఆదేరోజు 8:55 గంటలకు, విరాట్ కోహ్లీ వీడియో సందేశం ద్వారా బెంగళూరు వాసులను వేడుకకు ఆహ్వానించారు. 3:14 గంటలకు చివరి పోస్టులో విజయోత్సవ ర్యాలీ విధానసౌధ నుంచి చిన్నస్వామి స్టేడియం దాకా సాగుతుందని పేర్కొన్నారు. ఇందులోనే ఆర్సీబీలో ఉచిత పాసులు లిమిటెడ్ ఎంట్రీలో అందుబాటులో ఉంటాయని పేర్కొంది.

అంతకు ముందు పోస్టులు ఆధారంగా చూస్తే ఈవెంట్‌కు అందరికీ ఉచితం విషయం అర్థమవుతుందని హైకోర్టుకు సమర్పించిన నివేదికలో కర్ణాటక సర్కార్ వెల్లడించింది. ఆర్సీబీ చేసిన ఆ పోస్టులకు విస్తరితమైన స్పందన లభించిందని నివేదికలో పేర్కొంది. మొదటి పోస్టుకు 16 లక్షలు, రెండవ పోస్టుకు 4.26లక్షలు, మూడవ పోస్టుకు 7.6 లక్షలు, నాలుగోవ పోస్టుకు 17 లక్షల వ్యూస్ వచ్చాయి. అంచనాలకు మించి భారీ సంఖ్యలో ప్రజలు వచ్చారు. జూన్ 4న మధ్యాహ్నం 3:14 గంటలకు రద్దీ ఎక్కువగా ఉంది. అదే సమయంలో నిర్వాహకులు ఆకస్మాత్తుగా పాసులు అవసరమని ప్రకటించారు. దీంతో అప్పటికే అక్కడికి చేరుకున్నవారు గందరగోళానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో వేదిక నిర్వాహకులు గేట్లుతెరిచే క్రమంలో తొక్కిసలాట జరిగింది. ఆర్సీబీ, ఈవెంట్ నిర్వాహణ సంస్థ డీఎన్ఏ, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ మధ్య సరైన సమన్వయం లేకపోవడమే ప్రధాన కారణం అని నివేదికలో పేర్కొంది. ఈ ఘటన తర్వాత కర్ణాటక ప్రభుత్వం జూన్ 5న ఉన్నతాధికారులను సస్పెండ్ చేసింది. దీనిపై దర్యాప్తు చేసేందుకు రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. తొక్కిసలాటలో 11 మంది మృతి చెందారు.

# బిజెపి పక్షపాతి ఎన్నికల సంఘం: -రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ,జూలై 18:** కేంద్ర ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ. ఎన్నికల సంఘం బిజెపికి పక్షపాతంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. బీహార్‌లో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరిట ఓట్లను తొలగిస్తున్నట్లు ఆరోపించారు. ఈ క్రమంలోనే ఎన్నికల సంఘం స్వతంత్రతపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. జీ ఎలక్షన్ కమిషన్‌లా కాకుండా పూర్తిగా బిజెపి ఎలక్షన్ చోర్‌బ్రాంచ్‌గా మారిపోయిందని విమర్శించారు. అజిత్ అంజుమ్ అనే యూట్యూబర్ బీహార్ ఓటర్ జాబితాపై నిర్వహిస్తున్న సిరీస్‌ను పోస్ట్‌చేశారు. ఓటర్లకు సంబంధించిన వివరాలు తెలుసుకోకుండానే సంతకం చేసి జాబితా నుంచి తొలగిస్తున్న అధికారుల దృశ్యాలను అందులో షేర్ చేశారు. కాగా కేవలం 6.85శాతం ఓటర్లు మాత్రమే ఎన్యూమరేషన్ పత్రాలను నింపేవారు మిగిలి ఉన్నారని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేసి, ఎన్యూమరేషన్ పత్రాలను ఎన్నికల సంఘానికి సమర్పించేందుకు ఇంకా 9 రోజుల సమయం ఉందని చెప్పింది. బీహార్‌లోని మొత్తం 7.89 కోట్ల మంది ఓటర్లలో 6.99 కోట్లకు పైగా ఓటర్లు పత్రాలను సమర్పించినట్లు వెల్లడించింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ 9 రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో ఈ ప్రకటన విడుదలచేసింది. ఇప్పటి వరకు 88.65 శాతం ఓటర్ల వివరాలను సేకరించినట్లు చెప్పింది. వీరితోపాటు మొత్తం ఓటర్లలో 1.59 శాతం మంది ఓటర్లు మృతిచెందగా, 2.2 శాతం మంది రాష్ట్రం నుంచి శాశ్వతంగా వెళ్లిపోయినట్లుగుర్తించింది. మరో 0.73 శాతం మందికి ఒకటి కంటే ఎక్కువ ఓట్లు ఉన్నట్లు జసి తెలిపింది.ముసాయిదా ఓటర్ జాబితాను 2025 ఆగస్టు 1న ప్రకటిస్తామని వెల్లడించింది. ఈ ప్రక్రియలో పాల్గొన్న ఓటర్లకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ధన్యావాదాలు తెలిపారు.




## భారత్ దౌత్యంవల్లనే నిమిష మరణశిక్ష వాయిదా

**న్యూఢిల్లీ,జూలై 18:** కేరళకు చెందిన నర్సు నిమిష ప్రియకు జూలై 16న యెమన్‌లో విధించాల్సిన మరణశిక్ష వాయిదా పడిందని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. తాము నిరంతరం జరుపుతున్న దౌత్యం వల్లే ఇది సాధ్యమైందని ఎంఈఏ తెలిపింది. నిమిష ప్రియ కుటుంబానికి, యెమెన్‌కు చెందిన బాధిత కుటుంబానికి మధ్య పరస్పర అంగీకార యోగ్యమైన పరిష్కారాన్ని కనుగొనేందుకు జరుగుతున్న చర్చల వల్లే మరణశిక్షను వాయిదా వేశారని పేర్కొంది. ఇది సున్నితమైన అంశమని, నిమిష ప్రియ కుటుంబానికి భారత ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉందని, చేయూతను అందిస్తోందని విదేశాంగశాఖ వెల్లడించింది. న్యాయసహాయంద్వారా న్యాయ సహాయాన్ని అందించడంతో పాటు అక్కడి అధికార యంత్రాంగంతో, నిమిష ప్రియ కుటుంబీకులతో భారత రాయబార కార్యాలయ సిబ్బంది నిత్యం టచ్‌లో ఉంటున్నట్లు తెలిపింది. ఈఅంశంపై యెమెన్‌కు సన్నిహితంగా ఉండే కొన్ని మిత్రదేశాలతోనూ సమన్వయం చేసుకుంటున్నట్లు భారత విదేశాంగ శాఖ పేర్కొంది.

# అమెరికా పౌరసత్వం ఉన్న చిన్నారికి భారత్‌లో దత్తత హక్కులు ఇవ్వలేం



## పిటిషన్ తిరస్కరించిన బాంబే హైకోర్టు

**ముంబయి,జూలై 18:** అమెరికా జాతీయులైన చిన్నారిని దత్తత తీసుకునే ప్రాథమిక హక్కు భారతీయులకు లేదని బొంబాయి హైకోర్టు కీలక తీర్పునిచ్చింది. సంరక్షణ, భద్రత అంశాలు లేదా చట్టపరమైన వివాదం లేని సమయంలో బంధువులైనా సరే దత్తతకు అవకాశం లేదని తెలిపింది. జువెనైల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ, భద్రత) చట్టం, దత్తత నిబంధనల ప్రకారం ప్రస్తుత కేసులోని చిన్నారి వీటి పరిధిలోకి రాదని హైకోర్టు పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ రేవతి మొహితే దేరే, జస్టిస్ నీలా గోఖలేతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తీర్పును ఇచ్చింది. జన్మతః అమెరికా పౌరుడైన తమ బంధువుల చిన్నారిని దత్తత తీసుకునేందుకు అనుమతించాలంటూ భారతీయ జంట దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. విదేశీ పౌరసత్వం కలిగిన చిన్నారిని బంధువులైనా సరే దత్తత తీసుకోవడానికి జువెనైల్ జస్టిస్ చట్టంలో లేదా దత్తత విధానంలో ఎలాంటి నిబంధన లేదు. ఆ చిన్నారికి సంరక్షణ అవసరమని భావించినప్పుడు తప్పితే దత్తతకు అవకాశం ఉండదు అని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే దత్తతకు అనుమతి ఇచ్చేందుకు తన అసాధారణ అధికార పరిధిని వాడేందుకు కూడా ధర్మాసనం నిరాకరించింది. అమెరికన్ జాతీయులైన చిన్నారిని దత్తత తీసుకోవడానికి పిటిషనర్లకు ప్రాథమిక హక్కు లేదని తేల్చి చెప్పింది.

**అక్కడ దత్తత తీసుకున్నాకే ఇక్కడికి**

ఈ కేసుకు సంబంధించిన చిన్నారి 2019లో అమెరికాలో జన్మించింది. పిటిషన్ దాఖలు చేసిన జంట నెలల సమయంలోనే చిన్నారిని భారత్‌కు తీసుకువచ్చారు. అప్పటి నుంచి చిన్నారి వారితోనే నివసిస్తుండగా, తాజాగా అతడిని దత్తత తీసుకునేందుకు ప్రయత్నాలు చేపట్టింది. అయితే, అమెరికన్ చట్టాలు, నిబంధనల ప్రకారం అక్కడి జాతీయులైన చిన్నారిని దత్తత తీసుకోవడానికి అవసరమైన ప్రక్రియను పిటిషనర్ జంట పూర్తి చేయాల్సి ఉంటుందని ధర్మాసనం తెలిపింది. అక్కడ దత్తత పూర్తయ్యాకే ఆ విదేశీ బిడ్డను దేశానికి తీసుకురావడానికి కావాల్సిన ప్రక్రియను చేపట్టాలని హైకోర్టు పేర్కొంది. అమెరికా జాతీయుడైన చిన్నారిని దత్తత తీసుకునేందుకు సరైన నిబంధనలు లేని కారణంతో పిటిషనర్ జంట పేరును చేర్చేందుకు సెంట్రల్ అడాప్షన్ రీసోర్స్ ఏజెన్సీ నిరాకరించింది. చిన్నారికి సంరక్షణ, భద్రత లేదా చట్టంతో వివాదం నడుస్తున్న సమయంలోనే దత్తత తీసుకునేందుకు జువైనల్ చట్టం అనుమతి ఇస్తుందని తెలిపింది. ఈ క్రమంలోనే అమెరికా చట్టాల ప్రకారం చిన్నారిని అక్కడ దత్తత తీసుకోకుండా భారత్‌లో దత్తత తీసుకునేందుకు అనుమతి ఇవ్వలేమని హైకోర్టుకు చెప్పింది. దీంతో దత్తతకు అనుమతించడానికి తాము సుముఖంగా లేమని పేర్కొంటూ బొంబాయి హైకోర్టు పిటిషన్‌ను కొట్టివేసింది.

# షాపింగ్‌మాల్‌లో అగ్నిప్రమాదం

## 61 మంది మృతి

**బాగ్దాద్, జూలై 18:** ఇరాక్‌లోని షాపింగ్‌మాల్‌లో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. దీంతో ఆ దుర్ఘటనలో 61మంది ప్రాణాలు కోల్పోయారు. మృతిచెందిన వారిలో మహిళలు, చిన్నారులే ఎక్కువమంది ఉన్నారు. కుట్ నగరంలో బుధవారం రాత్రి ఈ ఘటన జరిగింది. అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం, కట్ నగరంలో బుధవారం రాత్రి నూతనంగా ప్రారంభమైన ఐదంతస్థులు భవనంలో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో చాలా మంది ఊపిరాడక మరణించారు. వారిలో 14మంది మృత దేహాలు గుర్తుపట్టలేని విధంగా ఉన్నాయి. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. భవనంలో చిక్కుకున్న 45 మందిని అధికారులు కాపాడగలిగారు. మరికొందరి ఆచూకీ లభించడం లేదు. 48 గంటల్లో ప్రాథమిక దర్యాప్తు వివరాలు వెల్లడిస్తామని స్థానిక యంత్రాంగం వెల్లడించింది. ఈ ఘటన నేపథ్యంలో ఆభవనం, షాపింగ్ మాల్ యజమానులపై పలు కేసులు నమోదయ్యాయి. భవనం నిర్మాణ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఇరాక్‌లో తరచూ అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి. మరోవైపు అగ్నిప్రమాదం జరిగిన ప్రదేశానికివెళ్లి దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఇరాక్ ప్రధానమంత్రి మహ్మద్ షియా అల్‌సుదానీ తెలిపారు. ఇదిలా ఉండగా, దేశవ్యాప్తంగా మూడు రోజుల పాటు సంతాప దినాలు ప్రకటించినట్లు ప్రావిన్ గవర్నర్ వెల్లడించారు. అగ్నిప్రమాదానికి గల కారణం గురించి విచారణ జరుగుతోందని తెలిపారు. ఈ దుర్ఘటనకు బాధ్యులైనవారిపై కఠినంగాచర్యలు తీసుకుంటామని గవర్నర్ స్పష్టం చేశారు. అయితే ఈ షాపింగ్ మాల్‌ను కేవలం ఒక వారం క్రితమే ప్రారంభించారు. దీనిలో రెస్టారెంట్, సూపర్ మార్కెట్‌లు కూడా ఉన్నాయి. సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చిన దృశ్యాల్లో మాల్‌లో చాలాభాగం మంటల్లో చిక్కుకుపోయినట్లుకనిపించింది. భవనంనిర్మాణ సమయంలో తగిన జాగ్రత్తలు తీసు కోకపోవడం వల్ల ఇరాక్‌లో తరచూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయని పలువురు అంటున్నారు. 2021 జులైలో ఇరాక్ నగరం సిరియాలోని ఆస్పత్రిలో జరిగిన అగ్నిప్రమాదంలో 60 నుంచి 92 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు.

# అలస్కాలో 7.3 తీవ్రతతో భూకంపం

## సునామీ హెచ్చరికలు

**వాషింగ్టన్, జూలై 18:** అమెరికాలోని అలస్కా తీరంలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 7.3 తీవ్రతగా దీన్నిగుర్తించారు. దీంతో యుఎస్ జియోలాజికల్ సర్వే సునామీ హెచ్చరికలు చేసింది. అయితే ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టానికి సంబంధించిన వివరాలు వెల్లడి కాలేదు. ముందస్తు జాగ్రత్తగా పౌరులు సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని అధికారులు సూచనలు జారీ చేశారు. అక్కడి కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 12.37 గంటలకు ఇది చోటుచేసుకుంది. 20 కి.మీ. దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. స్యాండ్ పాయింట్ సిటీకి 87 కి.మీ. దూరంలో దీని ఎపిసెంటర్ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. దక్షిణ అలస్కా, అలస్కా పెనిన్సులా ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. గంట తర్వాత హెచ్చరికలు విరమించుకున్నారు. భూకంపాలు తరుచుగా వచ్చే పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ ప్రాంతంలో అలస్కా ఉంది. 1964లో ఈ ప్రాంతంలో 9.2 తీవ్రతతో భూకంపం వచ్చింది. దీంతో 250 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు.

# 125 యూనిట్లవరకూ ఉచిత విద్యుత్



## బీహార్ సిఎం నితీష్‌కుమార్ ఎన్నికల వరాలు

**పాట్నా,జూలై 18:** బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ గురువారం రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులకు 125 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును ప్రకటించారు. ఈ ఏడాది చివర్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున నితీష్‌కుమార్ ఒక్కొక్కటిగా ఎన్నికల వరాలు ప్రకటిస్తున్నారు. ఈ ఏడాది అక్టోబర్ లేదా నవంబర్‌లో ఎన్నికలు జరగవచ్చని సమాచారం. ఈ నేపథ్యంలోనే సిఎం రాష్ట్ర ప్రజలపై వరాలజల్లు కురిపించారు. మేము ప్రారంభం నుంచి చౌకధరకే విద్యుత్తును అందిస్తున్నాము. 2025 ఆగస్టు 1 నుంచి, అంటే జులై బిల్లు నుండే, రాష్ట్రంలోని అన్ని గృహ వినియోగదారులు 125 యూనిట్ల వరకు విద్యుత్ కోసం ఎటువంటి డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదని బీహార్ ముఖ్యమంత్రి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్‌చేశారు.

రాష్ట్రంలోని మొత్తం 1 కోటి 67 లక్షల కుటుంబాలకు ఈపథకం ప్రయోజనం చేకూరుస్తుంది. అలాగే గృహ వినియోగ దారుల సమ్మతితో ఇంటి పైకప్పులపై లేదా సమీపంలోని బహిరంగ ప్రదేశాలలో సౌర ఫలకాలను ఏర్పాటు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం గురించి కూడా ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈనిర్ణయం రాబోయే మూడు సంవత్సరాలలో అమలు చేయడం జరుగుతుందని సిఎం నితీశ్ కుమార్ చెప్పారు. కుటిర్ జ్యోతి పథకం కింద అత్యంత పేద కుటుంబాలకు సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి అయ్యే మొత్తం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది, మిగిలిన వాటికి తగిన సహాయాన్ని అందిస్తుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలను గుర్తించి, ఉపాధ్యాయ నియామక పరీక్షను వీలైనంత త్వరగా నిర్వహించే ప్రక్రియను ప్రారంభించాలని నితీశ్ కుమార్ బుధవారం విద్యా శాఖ అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యా యుల ఖాళీలను గుర్తించి, అర్హత పరీక్షను త్వరగా నిర్వహించే ప్రక్రియను ప్రారంభించాలని విద్యా శాఖకు ఆదేశాలు జారీ చేశాం. ఈ నియా మకాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్ల ప్రయోజనం బీహార్ నివాసితులకు ఇవ్వబడుతుం దని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసిందని సీఎం బుధవారం తన సోషల్‌మీడియా ఖాతాలో వివరించారు.

# ఉత్తరాదిలో భారీ ఎత్తున మిల్క్ మిక్సింగ్

## ఎఫ్ఎస్ఎస్ఎఐ భారీ దాడులు, పలు ఉత్పత్తులు స్వాధీనం

**అహ్మదాబాద్,జూలై 18:** గుజరాత్‌లో పాల కల్తీ పెచ్చుమీరిపోతోంది. తరచూ పాలల్లో 20శాతం నీళ్లుకలపడంవల్ల ఆహార ఉత్పత్తుల తయారీలో కొంతమేర వ్యయభారం తగ్గుతుందని వ్యాపారులు, అధిక మొతాదులో విక్రయించుకునేందుకు పాలడీలర్లు కూడా ఈ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు అంచనా. కొంతమంది తినుబండారాల తయారీదారులు కూడా వ్యయం తగ్గించుకోడంతోపాటు ఇలా పాలల్లో మిక్సింగ్ వల్ల మరింత ఆకర్షణీయంగా చేయవచ్చని వీటికి పాల్పడుతున్నారు. నీళ్లుకలిపితే పర్వాలేదు కానీ ఇతరత్రా కల్తీలు జోడిస్తుండటంతో అధికారులు మాటువేసి వీరిని కట్టడిచేసారు. ఫుడ్‌సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) కూడా ఇటీవలే దేశవ్యాప్తంగా తనిఖీలు ముమ్మరంచేసింది. ప్యాకేజింగ్, ఉత్పత్తి, విక్రయాల్లోకూడా భద్రతా ప్రమాణాలు తగ్గితే చర్యలు తప్పవని హెచ్చరించింది. ఇటీవలే ఉత్తరప్రదేశ్ ఎఫ్ఎస్‌డిఎ అధికారులు అక్రమ పాలమిక్సింగ్ ఆపరేషన్ కొనసాగుతుంటే ఆగ్రాపరిసరాల్లో దాడులుచేసి పట్టుకున్నారు. ట్యాంకర్‌నుంచి నేరుగాపట్టుకున్న పాలను పారబోయిస్తున్న ట్యాంకర్ల చిత్రాలను కూడా ఎఫ్ఎస్ఎఐ అధికారులు విడియోలు వైరల్‌చేసారు. దర్యాప్తు పూర్తిఅయ్యాక వారిపై చర్యలు తీసుకుంటామని ఎఫ్ఎస్‌డిఎ వెల్లడించింది.

# ఉత్తరాఖండ్ ప్రభుత్వ స్కూళ్లలో విధిగా గీతాపఠనం!

**డెహ్రాడూన్,జూలై 18:** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో భగవద్గీతపఠనం చేయాలని ఉత్తరాఖండ్‌ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఉదయం పూట పాఠశాలకు వచ్చినవెంటనే ముందు భగవద్గీత శ్లోకాలను పఠించాలని వివరించారు. స్వీయక్రమశిక్షణ; నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడంతోపాటు విద్యార్థినీ విద్యార్థుల్లో ఉద్వేగభరిత లక్షణాలను నియంత్రించుకునేందుకు భగవద్గీత పఠనం తప్పనిసరి అని వెల్లడించింది. మాధ్యమిక విద్యాశాఖ డైరెక్టర్ డా.ముకుల్‌కుమార్ సతి ఈమేరకు ఈనెల 14వ తేదినే ఆదేశాలు జారీచేసారు. ప్రతిరోజు ఒక గీతాశ్లోకం చదవాలని ఆయన ఆలేఖలో వివరించారు. ఆశ్లోకం శాస్త్రీయ వివరణను కూడా ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించాలన్నారు. అలాగే ఈ వారం శ్లోకం అని టీచర్లు ఎంపికచేసి పాఠశాల నోటీసు బోర్డులో వాటిని ప్రదర్శించాలని దీనివల్ల విద్యార్థులు గీతాపఠనంపై దృష్టిసారించే అవకాశం ఉందన్నారు. ఆతర్వాత ఫీడ్‌బ్యాక్ కూడా ప్రభుత్వానికి నివేదించాలనిసూచించారు.

# దొంగతనాలు, దోపిడీలు చేస్తే శాశ్వత ఆంక్షలు తప్పవు



## అమెరికా రాయబార కార్యాలయం హెచ్చరిక

**వాషింగ్టన్, జూలై 18:** యుఎస్ వీసాలకు దరఖాస్తు చేసుకునే వారిని ఉద్దేశిస్తూ భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం తాజా హెచ్చరికలు జారీ చేసింది. చోరీలు, దోపిడీలు వంటి నేరాలకు పాల్పడేవారు అగ్రరాజ్యానికి వచ్చే అవకాశం లేకుండా శాశ్వత ఆంక్షలకు గురవుతారని హెచ్చరించింది. అమెరికాలో ఓ భారత టూరిస్ట్..దుకాణంలో చేస్తూ దొరికిపోయిన నేపథ్యంలో ఎంబసీ ఈ పోస్టు చేసింది. 'అమెరికాలో దాడులు, చోరీలు, దోపిడీలు వంటి నేరాలకు పాల్పడితే న్యాయపరమైన సమస్యలే కాదు.. దానివల్ల మీ వీసా రద్దయ్యే ప్రమాదం ఉంది. అంతేకాదు.. భవిష్యత్తులో అగ్రరాజ్య వీసాలకు దరఖాస్తు చేసుకునే అర్హతను కోల్పోతారు. శాంతి భద్రతలకు అమెరికా అత్యంత విలువనిస్తుంది. విదేశీయులు కూడా అమెరికా చట్టాలను తప్పనిసరిగా పాటించాలని ఆశిస్తుంది' అని యుఎస్ ఎంబసీ తమ పోస్టులో రాసుకొచ్చింది.

భారత్‌కు చెందిన ఓ పర్యాటకురాలు ఇల్లినాయిస్ స్టోర్‌లో చోరీ చేస్తూ దొరికిపోయింది. స్థానికంగా ఉన్న 'టార్గెట్' రిటైల్ స్టోర్‌కు వెళ్లిన ఆమె.. దాదాపు 7 గంటలపాటు అక్కడే తిరుగుతూ కన్పించింది.

అనుమానం వచ్చిన సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చేలోపు ఆమె వెనకవైపు ఉన్న గేటు నుంచి వెళ్లేందుకు ప్రయత్నించింది. కానీ, పోలీసులు అప్పటికే అక్కడికి చేరుకుని ఆమెను పట్టుకున్నారు. దాదాపు 1300 డాలర్ల విలువైన (రూ. 1.11 లక్షలు) వస్తువులను ఆమెను స్టోర్ నుంచి చోరీ చేసేందుకుయత్నించింది. ఆమెను అరెస్టు చేసిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఆ పర్యాటకురాలిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# సంక్షిప్తంగా

## బిఎల్ఏ దాడిలో 27 మంది పాక్ సైనికులు హతం



**ఇస్లామాబాద్, జూలై 18:** బలోచ్ లిబరేషన్ ఆర్మీ పాకిస్థాన్ సైన్యానికి ఊపిరి ఆడనివ్వడం లేదు. గత రెండురోజుల్లో 27 మంది పాక్ సైనికులను మట్టుపెట్టినట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ విషయాన్ని ఆ సంస్థ ఓ సోషల్ మీడియా పోస్టులో వెల్లడించింది. బీఎల్ఏకు చెందిన ఫతే స్క్వాడ్ కలాత్‌లోని నిమ్రాగ్ క్రాస్ వద్ద సైనికులను తరలిస్తున్న ఓ బస్సును లక్ష్యంగా చేసుకొని దాడి చేసింది. ఇందులో 27 మంది సైనికులు చనిపోగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ బస్సు కరాచీ నుంచి క్వెట్టాకు దళాలను తరలిస్తుండగా ఈ దాడి చోటుచేసుకొంది. మరో ఘటనలో క్వెట్టాలోని హజార్‌గంజ్‌లో ఐఈడి పేల్చి మరో ఇద్దరు సైనికులను హతమార్చినట్లు బీఎల్ఏ వెల్లడించింది. మంగళవారం కలాత్‌లోని ఖజినా ప్రాంతంలో మరో ఐఈడి పేల్చి నలుగురు సైనికులను, బుధవారం గుజ్రోకోర్ ఏరియాలో దాడి చేసి మరో ఆరుగురు సైనికులను హత్య చేసినట్లు బీఎల్ఏ ప్రకటించింది. వీరిలో మేజర్ సయిద్ రబ్ నవాజ్ తరీక్ కూడా ఉన్నట్లు చెప్పింది.

## దుబాయ్‌లో పెళ్లికోసం ప్రత్యేక సెలవులు

**దుబాయ్, జూలై 18:** సాధారణంగా చాలా కంపెనీలు మాతృత్వపు సెలవులు, పితృత్వపు సెలవులు ఇస్తుంటాయి. ఇప్పుడు పెళ్లికోసం కూడా ప్రత్యేకంగా సెలవులు ఇస్తోంది దుబాయ్ ఉద్యోగుల సంక్షేమం, కుటుంబ విలువలను ప్రోత్సహించే దిశగా ఈ వినూత్న నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ విభాగాల్లో పనిచేసే ఉద్యోగుల పెళ్లికి 10 రోజుల వేతనంతో కూడిన సెలవులు ప్రకటించింది. ఈ మేరకు దుబాయ్ పాలకుడు, యుఎఇ ప్రధానమంత్రి షేక్ మహ్మద్ బిన్ రషీద్ అల్ మక్తుమ్ దీనిపై డిక్రీ జారి చేశారు. అయితే ఈ కొత్త పాలసీ ఈ యేదాది జనవరి నుంచే అమల్లోకి వచ్చినట్లు అందులో పేర్కొన్నారు. వర్క్,లైఫ్ బ్యాలెన్స్, సమాజ ఐక్యతను పెంపొందించడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. దుబాయ్ అన్ని ప్రభుత్వ విభాగాలు, న్యాయసంస్థలు, మిలిటరీ సిబ్బంది, దుబాయ్ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సెంటర్ తదితర డిపార్ట్‌మెంట్‌లలో పనిచేసే ఉద్యోగులందరికీ ఈ సెలవులు వర్తించనున్నట్లు ఆ డిక్రీలో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇతర విభాగాలకు కూడా దీన్ని విస్తరించాలని నిర్ణయించారు.

## కన్నడ నటి రన్యారావుకు యేడాది జైలు శిక్ష!



**బెంగళూరు, జూలై 18:** అక్రమంగా బంగారం తీసుకొస్తూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన కన్నడనటి రాన్యరావు కేసు సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. రన్యారావుకు ఏడాది జైలు శిక్ష పడింది. విదేశీ మారక ద్రవ్య పరిరక్షణ, స్మగ్లింగ్ కార్యకలాపాల నివారణ బోర్డు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో రన్యారావుతో పాటు మరో ఇద్దరు నిందితులైన తరుణ్ కొండారు రాజు, సాహిల్‌లకు కూడా ఇదే శిక్ష విధించినట్లు బోర్డు తెలిపింది. అక్రమ రవాణాకు సంబంధించి బలమైన ఆధారాలు ఉన్న నేపథ్యంలో శిక్షాకాలంలో వారు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేదని తెలిపింది. దీంతో ముగ్గురు నిందితులు ఏడాది పాటు జైల్లోనే ఉండాల్సి ఉంది. ఈ కేసులో ప్రతి మూడు నెలలకు ఒకసారి విచారణలు జరుగుతాయని పేర్కొంది. ఇలా ఏడాది వరకు కొనసాగుతాయని వెల్లడించింది.

## ఎరువుల కోసం డిమాండ్, రైతుపై లాఠీచార్జి!

**లక్నో, జూలై 18:** ఎరువుల కోసం డిమాండ్ చేసిన రైతుపై పోలీసులు తమ ప్రతాపం చూపారు. కర్రలతో అతడ్ని కొట్టారు. ఆ రైతు తల్లిపై కూడా పోలీసులు దాడి చేశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. బిజెపి పాలిత ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బుధవారం ఈ జిల్లాకు చెందిన చిన్నకారు రైతులు ప్రభుత్వ ఎరువుల షాపుల వద్ద బారులు తీరారు. తమకు యూరియా అందలేదని వాపోయారు. ధనిక రైతులకు ఎరువులతో నిండిన లారీలు పంపుతున్నారని ఆరోపించారు. రోడ్డును దిగ్బంధించి నిరసన తెలిపారు. అక్కడకు చేరుకున్న పోలీసులు నిరసనకారులపై లాఠీచార్జి చేశారు.

## సాటిలేని ఆఫర్‌లతో సామ్‌సంగ్ డేస్ సేల్




**విజయవాడ, జులై 18(జర్నలిస్ట్‌ఫైల్):**

ప్రత్యేకంగా సామ్‌సంగ్.కామ్, సామ్‌సంగ్ షాప్ యాప్, సామ్‌సంగ్ ఎక్స్‌పీరియన్స్ స్టోర్‌లలో జులై 12న సామ్‌సంగ్ డేస్ సేల్‌ను ప్రారంభించినట్లు భారతదేశ అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్ ప్రకటించింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ క్యాంపెయిన్ జులై 18 వరకు కొనసాగనుంది. ఇది కస్టమర్లకు ఉత్తమ ఆఫర్‌లు, ప్రత్యేకమైన ఎక్స్ఛేంజ్ డీల్స్, నిజంగా అసమానమైన షాపింగ్ అనుభవాన్ని అందిస్తుంది. ఈ సంవత్సరం సామ్‌సంగ్ డేస్ స్మార్ట్‌ఫోన్‌ల నుండి టీవీలు, టాబ్లెట్‌లు, రిఫ్రిజిరేటర్లు, ల్యాప్‌టాప్‌లు, వాషింగ్ మెషీన్‌ల వరకు సామ్‌సంగ్ అత్యాధునిక ఏఐ-ఆధారిత ఉత్పత్తులపై దృష్టి పెడుతుంది. తాజా తెలివైన సాంకేతికతతో తమ జీవితాలను సులభతరం చేయడానికి కస్టమర్లను శక్తివంతం చేస్తుంది.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత కావాలి

### ఎనిమిదవ ఆంధ్ర ఎయిర్ స్క్వాడ్రన్ ఎన్సిసి జూనియర్ వారెంట్ ఆఫీసర్ సూరజ్



**విజయవాడ పశ్చిమ, జులై 18(జర్నలిస్ట్‌ఫైల్):**

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత కావాలని ఎనిమిదవ ఆంధ్ర ఎయిర్ స్క్వాడ్రన్ ఎన్సిసి జూనియర్ వారెంట్ ఆఫీసర్ సూరజ్ చెప్పారు. పాతబస్తీలోనే ఎస్ కే పి వి వి హిందూ హైస్కూల్ ఎన్సీసీ అధికారి బి. బ్రహ్మేశ్వర రావు ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు ఎన్సిసి విద్యార్థుల కుమొక్కల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంచర్ల శ్రీనివాస రావు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అనేది విద్యార్థులు తమ ఇంటి నుంచే మొదలు పెట్టాలని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు పరిరక్షించే బాధ్యత కూడా విద్యార్థులే తీసుకోవాలన్నారు. అనంతరం సార్జెంట్ ఆర్. బిస్ట్ ను కలుపుకుని వారెంట్ ఆఫీసర్ సూరజ్ ఎన్సిసిలోకి విద్యార్థుల ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టారు. వయసు, విషయ పరిజ్ఞానం, దేహ దారుడ్యం అనుసరించి 50 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు యు. వెంకటేశ్వరరావు, కె. శ్రీనివాస్, డాక్టర్ ఎస్. వెంకటేశ్వరరావు, జి. పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఫొటోగ్రఫీ వర్క్ షాప్

### 130 మంది విద్యార్థులకు శిక్షణ



**విజయవాడ పశ్చిమ, జులై 18(జర్నలిస్ట్‌ఫైల్):**

కెబిఎన్ కళాశాల డ్రమటిక్ అసోసియేషన్, ఎన్ ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ వర్క్ షాపు గురువారం ముగిసింది. రిసోర్స్ పర్సన్ గా పాల్గొన్న కె.దీనారాజ్ నాలుగు రోజుల పాటు ఫొటోగ్రఫీలోని వివిధ అంశాలపై మొత్తం 130 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. మనం రోజువారీ చూసే సన్నివేశాల నుంచి విభిన్నకోణంలో ఫొటోలు తియ్యటం, ఫొటో కోసం సన్నివేశాన్ని ఎంచుకోవటం, సహజ సన్నివేశాల నుంచి ఫొటోలు తియ్యటం, ఫొటో ఎడిటింగ్ తదితర అంశాల గురించి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు సభలో అతిథిగా పాల్గొన్న ఎస్.ఆర్.ఎస్.వి బీఈడీ కళాశాల సెక్రటరీ మాజేటి సతీష్ మాట్లాడుతూ టెక్నాలజీ ఆధారంగా ఫొటోగ్రఫీలో అనేక అధునాతన పద్ధతులు వస్తున్నాయని, వీటిని విద్యార్థులు అందిపుచ్చుకుని ఫొటోగ్రఫీ వృత్తిలో గొప్పగా రాణించవచ్చన్నారు. వర్క్ షాపులో నేర్చుకున్న అంశాలను నిత్యం సాధన చేయడం ద్వారా నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవచ్చన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ మూస పద్ధతిలో ఫొటోలు తియ్యటం కాకుండా సృజనాత్మకత, వైవిధ్యం, సాంకేతికత ఉట్టిపడేలా ఫొటోలు తియ్యాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించి, సత్కరించారు. బీఈడీ కళాశాల జాయింట్ సెక్రటరీ డి.రామకిశోర్, హిందూ హైస్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు బజార్లలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నిషేధాన్ని కచ్చితంగా అమలు చేయాలి

- మార్కెటింగ్ శాఖ నిర్దేశించిన ధరలు అమలయ్యేలా చర్యలు
- దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తే సహించం
- ఎస్టేట్ అధికారులకు దశ, దిశ నిర్దేశించిన ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా



**విజయవాడ, జులై 18(జర్నలిస్ట్‌ఫైల్):**

రైతు బజార్లలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నిషేధాన్ని కచ్చితంగా అమలు చేయడంతో పాటు, వినియోగదారులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా అధికారులను ఆదేశించారు. నగరంలోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో గురువారం మార్కెటింగ్, రైతు బజార్ల ఎస్టేట్ అధికారులతో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతు పండించిన పం టను నేరుగా వినియోగదారులకు రైతు బజార్ల ద్వారా అమ్మకాలు నిర్వహించి రైతులు, వినియోగదారులకు మేలు జరిగేలా రైతు బజార్ల వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అర్బన్ లో తొమ్మిది, రూరల్ లో ఆరు మొత్తంగా 15 రైతు బజార్ల ద్వారా వినియో గదారులకు తక్కువ ధరకే కూరగాయలు, నిత్యావసర వస్తువులను అందుబాటులో ఉంచామన్నారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నిషేధాన్ని రైతు బజార్లలో కచ్చితంగా అమలు చేయాలన్నారు. వ్యాపారాలు నిర్వహించే రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు తప్పని సరిగా గుర్తింపు కార్డులు కలిగి ఉండాలన్నారు. వినియోగదారులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. రైతు బజార్లో దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తే సహించేది లేదన్నారు. ఉదయం ఆరు గంటలకే అన్ని రైతు బజార్లలో ఎస్టేట్ అధికారులు విధులలో ఉండి ధరల పట్టికను సిద్ధంగా ఉంచాలన్నారు. మార్కెటింగ్ శాఖ నిర్ణయించిన ధరలకే రైతు బజార్లలో అమ్మకాలు నిర్వహించేలా ఎస్టేట్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. పరిసరాలను, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ శానిటేషన్ ను మెరుగుపరచాలన్నారు. రైతు బజార్ల ప్రక్షాళనకు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని, విధులలో అలసత్వం వహించిన, ఫిర్యాదులు వచ్చిన సహించేది లేదని జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా ఎస్టేట్ అధికారులను హెచ్చరించారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు బి. రాజబాబు, రైతుబజార్ల ఎస్టేట్‌అధికారులు ఉన్నారు.

## ఉన్నత కెరీర్ దిశగా ఇష్టపడి చదవండి

- ఐఐటీ, నీట్ పరీక్షల్లో మంచి ర్యాంకులకు కృషి చేయండి
- ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి
- గురుకుల విద్యార్థులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ
- పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్



**విజయవాడ, జులై 18(జర్నలిస్ట్‌ఫైల్):**

గురుకులం విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదగాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని.. వీటిని సద్వినియోగం చేసుకొని, ఇష్టపడి చదివి ఐఐటీ, నీట్ పరీక్షలో మంచి ర్యాంకులు సాధించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. జి.కొండూరు మండలం, కుంటముక్కల డా. బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను కలెక్టర్ లక్ష్మీశ గురువారం ఉదయం ఆకస్మికంగా సందర్శించారు. గురుకులం పరిసరాలతో పాటు తరగతి గదులు, కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్ తదితరాలను పరిశీలించారు. జేఈఈ, నీట్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో మాట్లాడారు. కొద్ది రోజుల్లోనే పోటీ పరీక్షల సబ్జెక్టు నిపుణులు కూడా అందుబాటులోకి వస్తారని, బాగా చదువుకొని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యతో కెరీర్ పరంగా ఉన్నత స్థానాలను అందుకోవచ్చన్నారు. విద్యతో పాటు భోజనం, వసతి తదితరాల పరంగా అత్యున్నత నాణ్యతా ప్రమాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రాజీలేకుండా ప్రాధాన్యమిస్తోందని, ఈ నేపథ్యంలో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు ప్రణాళిక ప్రకారం ప్రయత్నించాలని.. తల్లిదండ్రులకు, పాఠశాలకు, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో చదువుకునే ఎందరో మంచి స్థానాలకు వెళ్లారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందడుగు వేయాలన్నారు. గురుకులం పరిసరాలు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, విద్యార్థులు ఆహ్లాదకర వాతావరణంలో విద్యాబుద్ధులు నేర్చుకునేలా చొరవచూపాలని గురుకులం సిబ్బందికి కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కలెక్టర్ వెంట గురుకులం వైస్ ప్రిన్సిపల్ ఎన్.సుభాషిణి, సిబ్బంది ఉన్నారు.



## నాగపూర్ తాజ్ బాబా ఊర్సుకు విజయవాడ నుంచి బయలుదేరిన భక్తులు

**విజయవాడ, జులై 18(జర్నలిస్ట్‌ఫైల్):**

ఈనెల 20 నుంచి 26 తేదివరకు మహారాష్ట్ర లోని నాగపూర్ పట్టణంలో జరుగనున్న హజరత్ తాజుద్దీన్ బాబా వారి ఉర్సు మహోత్సవం లో పాల్గొనేందుకు విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి 500 మంది భక్తులు అండమాన్ ఎక్స్‌ప్రెస్ కు గురువారం బయలుదేరారు. తెనాలి సమీపంలోవున్న జంపని గ్రామం నుంచి అబస్తా ట్రస్ట్ చైర్మన్ సుఫీ గురువులు అతా మొహమ్మద్ నిజాముద్దీన్ నిజామి జనీషా తాజ్ ఖాద్రి బాబా (అతా నిజాం బాబా) భక్తులందరికి ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా తన స్వంత ఖర్చుతో ఉచిత ప్రయాణాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా నిజాం బాబా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణా నుంచి నాగపూర్ తాజ్ బాబా ఉర్సుకు రావాలనుకునే స్తామత లేని భక్తులకు తమ ట్రష్టు ద్వారా ఉచిత రైలు ప్రయాణం, నాగపూర్ పట్టణంలో వసతి. ఊరుసు జరిగే పదిరోజులు ఊరుసుకు వచ్చే లక్షలాది భక్తులకు అన్న పానీయా లను ఉచితంగా అందజేస్తున్నా మన్నారు. తాజ్ బాబా తన గురువు చీమల పాడు సుఫీ అత్తావుల్లా బాబా వారి ఆశీస్సులతో ఈసేవ కార్యక్రమం అనేక ఏళ్లుగా చేస్తూ వస్తున్నామన్నారు. విజయవాడ నుంచి బయలుదేరే భక్తులు తాజ్ బాబా వారికి ప్రత్యేక చందనాన్ని తీసుకుని వెళ్లి సమర్పిస్తామన్నారు. నాగపూర్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భక్తులకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు.



# లెవల్-2 ఆన్-సైట్ మాక్ డ్రిల్ విజయవంతం






### హెచ్.పి.సి.ఎల్. కొండపల్లి ఎల్.పి.జి బాట్లింగ్ ప్లాంట్‌లో నిర్వహణ

**విజయవాడ, జులై 18(జర్నలిస్ట్‌ఫైల్):**

హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్.పి.సి.ఎల్. ) కొండపల్లి ఎల్.పి.జి బాట్లింగ్ ప్లాంట్లో లెవల్-2 ఆన్-సైట్ మాక్ డ్రిల్ గురువారం విజయవంతంగా జరిగింది. ఎల్.పి.జి సంబంధిత క్లిష్టమైన సంఘటన జరిగినప్పుడు ప్లాంట్ మరియు సంబంధిత వాటాదారుల అత్యవసర సంసిద్ధత మరియు ప్రతిస్పందన సామర్థ్యాలను అంచనా వేయడానికి ఈ వ్యాయామం జరిగింది. ట్యాంక్ ట్రక్కును దించుతున్నప్పుడు లీక్ మరియు తదుపరి అగ్నిప్రమాదం సంభవించిన అత్యవసర పరిస్థితిని ఈ మాక్ దృశ్యం అనుకరించింది. ప్లాంట్ యొక్క బలమైన భద్రతా ప్రోటోకాల్‌లు మరియు సమన్వయ ప్రతిస్పందన విధానాన్ని ప్రదర్శించి, ఆన్-సైట్ అత్యవసర బృందం ఈ పరిస్థితిని వేగంగా నిర్వహించింది. ఈ డ్రిల్ హెచ్.పి.సి.ఎల్. విజయవాడ ఎల్.పి.జి ప్రాంతీయ కార్యాలయం డీజీఎం పంకజ్ ఎస్ చౌదరి, సీనియర్ ప్లాంట్ మేనేజర్ సత్య ప్రసాద్ ఎల్వీఆర్, సీనియర్ సేఫ్టీ ఆఫీసర్ ఆశిష్ కుమార్ మీనా, నిర్వహణ అధికారి సాయి మోహన్ పోలిసెట్టి, మేనేజర్ ఆపరేషన్స్ సిహెచ్.ఎస్.హరి ప్రసాద్, ఆపరేషన్స్ ఆఫీసర్ లు ఇషితా చౌహాన్, పుష్పేంద్ర కుమార్ సింగ్ ల నాయకత్వంలో నిర్వహించారు. ఈ డ్రిల్‌లో 6వ బెటాలియన్ ఏపీఎస్పీ, మంగళగిరి (ఎస్డీఆర్ఎఫ్)కి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ భూపేంద్ర కుమార్ నేతృత్వంలోని బీ/10హెచ్ బెటాలియన్ ఆఫ్ ఎన్డీఆర్ఎఫ్ చురుకుగా పాల్గొంది. మైలవరం ఫైర్ స్టేషన్ నుండి ఫైర్, రెస్క్యూ సిబ్బంది కూడా డ్రిల్‌లో పాల్గొన్నారు, బాహ్య అత్యవసర సేవలతో సమన్వయాన్ని మరింత బలోపేతం చేశారు. అదనంగా, మాక్ డ్రిల్‌లో సమీపంలోని మేజర్ యాక్సిడెంట్ హజార్డ్ ఫ్యాక్టరీల ప్రతినిధులు మరియు జిల్లా పరిపాలన నుండి అధికారులు ఉన్నారు, వారు అత్యవసర సంసిద్ధత మరియు చట్టబద్ధమైన భద్రతా మార్గదర్శకాలకు కట్టుబడి ఉండటం యొక్క అధిక ప్రమాణాలను గమనించి ప్రశంసించారు.

# జీఓలు సరే డిగ్రీ అడ్మిషన్ షెడ్యూల్ విడుదల చేయాలి

## విద్యార్థి సంఘాలు ఉన్నత విద్యామండలి చైర్మన్ కి వినతి



విజయవాడ, జులై 18(జర్నలిస్ట్‌ఫైల్):

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్యు, పిడిఎస్ఓ, సంఘాల రాష్ట్ర కమిటీలు ఆధ్వర్యంలో ధర్నా పిలుపునివ్వడంతో ప్రభుత్వం దిగొచ్చి అర్ధరాత్రి డిగ్రీ అడ్మిషన్ల జీఓను విడుదల చేసింది. జీఓ విడుదల చేసిన ప్రవేశాలకు షెడ్యూల్ వెంటనే ప్రకటించాలని విద్యార్థి సంఘాలు ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తి కి వినతి పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె ప్రసన్న కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బందెల నాసర్ జీ, పిడిఎస్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఐ.రాజేష్ మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు పూర్తయ్యి మూడు నెలలు గడుస్తున్న డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ మొదలు కాలేదన అన్నారు. 17వ తేదిన నిరసన ధర్నా చేపట్టిన విద్యార్థి సంఘాలకు ప్రభుత్వం దిగొచ్చి 16వ తేది రాత్రి జీఓ విడుదల చేసిందని అన్నారు. జీఓ విడుదల చేయడంతో ప్రవేశాల షెడ్యూల్ కూడా వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికే డిగ్రీ చేరాలనుకునే విద్యార్థులకు నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీలో చేరటం ఆలస్యం కావడం వలన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారన్నారు. కనుక వెంటనే డిగ్రీ ప్రవేశాల షెడ్యూల్ విడుదల చేయాలని కోరారు. పునరావృతం కాకుండా చూడాలని తెలిపారు. ప్రవేశాలను పూర్తిగా ఆఫ్లైన్ ద్వారా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్యా మండలి చైర్మెన్ మధుమూర్తి మాట్లాడుతూ షెడ్యూల్ వీలైనంత త్వరగా ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు రామ్మోహన్ కే. నాని, మహర్షి నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోట్ బుక్స్ వితరణ



ఆగిరిపల్లి, జులై 18(జర్నలిస్ట్‌ఫైల్):

ఆగిరిపల్లి మండలం,సర్నాల గూడెం ప్రాథమిక పాఠశాలకు ఉచితముగా నోట్ బుక్స్ పంపిణీ. విజయవాడ వాస్తవ్యులు విద్యా దాత, ప్రముఖ పారిశ్రామిక వేత్త,అనంత లక్ష్మీ సేవా సమితి గౌరవ అధ్యక్షులు మరియు శ్రీ రామకృష్ణ సమితి గౌరవ అధ్యక్షులు అయిన గోకరాజు గంగరాజు విద్యార్థులకు అవసరమైన అన్ని నోట్ బుక్స్ ఉచితముగా అందజేసి విద్యా అభివృద్ధి పట్ల తమకున్న దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జై. జ్ఞాన సుందరం, ఉపాధ్యాయుని, వి. విజయ శ్రీ మరియు విద్యార్థుల తల్లి దండ్రులు దాత అయిన గోకరాజు గంగరాజు కి కృతజ్ఞతలు తెలియ జేశారు.

# ఘనంగా అంతర్జాతీయ న్యాయవాదుల దినోత్సవం




మైలవరం, జులై 18(జర్నలిస్ట్‌ఫైల్):

అంతర్జాతీయ న్యాయవాదుల దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో గురువారం మైలవరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం మెంబర్లు అయినా ఏజీపి ఏడి ప్రసాద్, వీటి కిషోర్, పి దినేష్ తోపాటు సీనియర్ న్యాయవాది బుద్ధవరపు వెంకటరావు, తనుజులను ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ జాస్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ న్యాయవాదులు పేదల పక్షాన న్యాయం తరుపున వాదిస్తూ న్యాయవాద వృత్తికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం పిఎస్టీలు చనుమోలు నాగభూషణం, శీలం రామిరెడ్డి, చలువాది హరీష్ కుమార్ గుప్తా, సీనియర్ లైన్ మెంబర్లు గొల్లపూడి వెంకటేశ్వరరావు, మేడసానికిషోర్, లేళ్ల ఏడుకొండలు, ఏ చంద్రశేఖర్, శివకృష్ణ, సంగు రాంప్రసాద్, లక్ష్మీ గణేష్, పబ్బిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థికి నగదు రూపంలో ప్రోత్సాహకరం

ఆగిరిపల్లి, జులై 18(జర్నలిస్ట్‌ఫైల్):

నూజివీడు నియోజక వర్గం ఆగిరిపల్లి మండల పరిధిలోని వట్టిగుడిపాడు గ్రామం లో ఆల్ ఇండియా టాప్ 7 ఐఐటి వారణాసి కాలేజీ లో సీటు సాధించిన యలమర్తి జాన్ విల్సన్ (సిద్దు) గంగాధరరావు, (నాని) కుమారుడు కు రాష్ట్ర గృహ నిర్మాణం మరియు సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి 25000/- వేల రూపాయలు, అందజేశారు. ఈ కార్యక్రమానికి టీడీపి ఆగిరిపల్లి మండల అధ్యక్షులు నక్కబోయిన వేణు అధ్వర్యంలో, వట్టిగుడిపాడు టీడీపి పార్టీ అధ్యక్షుడు పిన్నిబొయిన చింతారావు సీనియర్ నాయకులు పెద్దలు చింతపట్ల చక్రధర మరియు 6వ వార్డు మెంబరు సింహాద్రి రాంబాబు మొదలగు వారు ఈ కార్యక్రమంలో పాల్గొని మంత్రి పార్థసారధికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# కొండపల్లి చరిత్రలో సువర్ణాధ్యాయం

- హర్షాతిరేకాల మధ్య కొండపల్లి మున్సిపాలిటీ ప్ర ప్రథమ కౌన్సిల్ సమావేశం
- రు.5.92 కోట్ల అభివృద్ధి పనులకు సభ్యుల ఏకగ్రీవ అమోదం
- ప్రథమ కౌన్సిల్ సభను హుందాగా నడిపిన చైర్మన్ చెన్నబోయిన చిట్టిబాబు




ఇబ్రహీంపట్నం, జులై 18(జర్నలిస్ట్‌ఫైల్):

కొండపల్లి చారిత్రక చరిత్రలో సువర్ణాధ్యాయానికి గురువారం నాడు తెరతీశారు. మున్సిపాలిటీ కౌన్సిల్ హాలును మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాదు లాంచనంగా ప్రారంభించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి జంపాల సీతారామయ్య, జనసేన పార్టీ మైలవరం నియోజకవర్గం ఇంచార్జి అక్కల గాంధీలు కొండపల్లి మున్సిపాలిటీ ప్ర ప్రథమ చైర్మన్ గా సమావేశాన్ని నిర్వహించబోతున్న సందర్భంగా చెన్నుబోయిన చిట్టిబాబుకు వారు అభినందనలు తెలిపారు. అనంతరం కొండపల్లి మున్సిపాలిటీ ప్రథమ కౌన్సిల్ సమావేశాన్ని మున్సిపాలిటీ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ప్రథమ సమావేశం కావడంతో ఎజెండా పత్రాలను టేబుల్ ఎజెండాగా సభ్యులకు గురువారం నాడు అందజేశారు. మున్సిపాలిటీ ఉద్యోగి అర్లయ్య సభలో ఎజెండాను సభ్యులకు చదివి వినిపించారు. అనంతరం చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు ఎజెండా గురించి సభ్యులకు క్లుప్తంగా వివరించారు. అనంతరం సభలో వైసిపి కౌన్సిలర్ మొగిలి దయా, మరో కౌన్సిలర్ ఎజెండాలో ఉన్న పలు అంశాల గురించి చర్చ జరుపుతారా..? లేదా..? అంటూ ప్రశ్నించారు. అందుకు చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు ఎజెండా పైన చర్చ జరపాలా వద్దా అని సభ్యుల అభిప్రాయాన్ని కోరారు. అందుకు 19 మంది కౌన్సిలర్లు ఎజెండాను ఆమోదించామని, చర్చ అవసరం లేదని చేతులు ఎత్తారు. దీంతో చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు సభను నిరవధికంగా వాయిదా వేశారు.

### భారీ ర్యాలీగా....

గురువారం నాడు ఉదయం తొలుత ఇబ్రహీంపట్నం రింగు సెంటర్ నుండి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జంపాల సీతారామయ్యలు తెదేపా కార్యకర్తలతో కలిసి కొండపల్లి మున్సిపాలిటీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో బాగంగా చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబుకు, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదుకు, జంపాల సీతారామయ్యలకు కలిపి టిడిపి కార్యకర్తలు గజమాలను వేశారు. ర్యాలీకి కొండపల్లి, ఇబ్రహీంపట్నం నుండి తెదేపా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బాణా సంచా కాలుస్తూ కార్యకర్తలు ఆనందహేల వ్యక్తం చేశారు. మొత్తం మీద కొండపల్లి మున్సిపాలిటీ ప్రప్రథమ సమావేశం సందర్భంగా కొండపల్లి మున్సిపాలిటీ పరిదిలో పండుగ వాతావరణం నెలకొంది.

### చైర్మన్ దంపతులకు పౌరసన్మానాలు..

ఇదిలా ఉండగా గురువారం ఉదయం నుండి కొండపల్లి మున్సిపాలిటీ పరిదిలోని పౌరులు, టిడిపి అబిమానులు, చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు పరిచయస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి చైర్మన్ దంపతులకు దుశ్శాలువాలు కప్పి, పూల దండలు వేసి ఘనంగా సత్కరించారు.

### వైస్ చైర్మన్ చుట్టుకుదురుకు సన్మానాలు.

వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావుకు గురువారం ఉదయం నుండి పౌరులు, సహచరులు, టిడిపి అభిమానులు కొండపల్లి మున్సిపాలిటీ కార్యాలయం వద్దకు చేరుకుని దుశ్శాలువాలు కప్పి, పూలదండలు వేసి ఘనంగా సత్కరించారు.

# ఈ నెల 19న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

- ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొందిద్దాం థీమ్‌తో ప్రత్యేక కార్యక్రమాలు
- దుష్పరిణామాలు, ప్రత్యామ్నాయాలపై ప్రజలను జాగృతం చేయండి
- స్వయం సహాయక సంఘ మహిళలు, విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టిసారించండి
- విద్యా సంస్థల్లో ఎకో క్లబ్‌లను క్రియాశీలం చేయాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, జులై 18(జర్నలిస్ట్‌ఫైల్):

ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి, సకల ప్రాణకోటి మనుగడుకు పెను ముప్పు ఉందని.. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్‌కు ఫుల్‌స్టాప్ పెట్టి, ఆహ్లాదకర వాతావరణాన్ని భావితరాలకు వారసత్వంగా ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ఈ మహత్తర లక్ష్య సాధనకు ఈ నెల 19న రాష్ట్ర ప్రభుత్వం ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొందిద్దాం ఇతివృత్తంతో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్.. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రతో పాటు వివిధ ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమాల విజయవంతానికి క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై సీఎస్ దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం ప్రత్యేక థీమ్‌తో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలకు మార్గదర్శకాలకు ఇచ్చిందని, ఇందులో భాగంగా ఈ నెల ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూ షన్ థీమ్‌తో కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. మెల్లమెల్లగా మన జీవితాలు ప్లాస్టిక్ ఉచ్చులో చిక్కుకు న్నాయని.. ఇప్పుడు మేలుకోకుంటే మరి కోలుకోలేమని, ప్రజలు, గౌరవ ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు సమష్టి భాగస్వామ్యంతో ప్లాస్టిక్ కాలుష్యాన్ని సమాజం నుంచి దూరం చేద్దామని పిలుపునిచ్చారు. ర్యాలీలు, సమావేశాలు, కరపత్రాలు, కళా ప్రదర్శనలు, డిజిటల్ కంటెంట్ తదితరాల ద్వారా ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించాలని, ప్లాస్టిక్ దుష్పరిణామాలు, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలుపై అవగాహన కల్పించాల న్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో గ్లాస్ బాటిల్స్, క్లాత్ బ్యాగ్స్, పేపర్ ప్యాకింగ్ వంటివాటిని ప్రోత్సహించాలన్నారు. రైతు బజార్లు, అన్ని రకాల దుకాణాల్లోనూ పాలిథీన్ సంచులు ఉపయోగించకుండా పటిష్ఠ పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. విద్యా సంస్థల్లో ఎకో క్లబ్‌లను క్రియాశీలం చేసి ప్లాస్టిక్ రహిత క్యాంపస్‌లుగా తీర్చిదిద్దేలా ప్రోత్సహించాలని, స్వయం సహాయక సంఘాల మహిళలను కూడా జాగృతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సమావేశంలో డీపీవో పి.లావణ్య కుమారి పాల్గొన్నారు.

# బహిరంగ చర్చకు సిద్ధమా?

## ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ సవాల్

మచిలీపట్నం, జులై 18(జర్నలిస్ట్‌ఫైల్):



గన్నవరం నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యే అయిన తర్వాత ఏఒక్కరి పైనా అక్రమ కేసు పెట్టలేదని ఈ విషయంలో పేర్ని నాని బహిరంగ చర్చకు రావాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ సవాల్ విసిరారు. ఇటీవల గన్నవరం వచ్చిన పేర్ని నాని గన్నవరం లో వైసీపీ నాయకులు కార్యకర్తలపై యార్లగడ్డ అక్రమ కేసులు పెడుతున్నారంటూ వ్యాఖ్యానించారు. మచిలీపట్నంలో పోలీసు శిక్షణ కేంద్రం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం ఉదయం బందరు వచ్చిన యార్లగడ్డ విలేకరులతో మాట్లాడుతూ పేర్ని నాని వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ తనకు సంబంధం లేని విషయాలను తనకు ఆపాదిస్తూ పేర్ని నాని వ్యాఖ్యలు చేయడం గర్హనీయమన్నారు. గన్నవరం నియోజకవర్గంలో 2019 నుంచి ఇప్పటివరకు ఎన్ని కేసులు నమోదు అయ్యాయో పోలీస్ స్టేషన్ల వారీగా వివరాలు తీసుకొని చర్చిద్దామని సవాల్ చేశారు. దీనికి మంది మార్బలం అవసరం లేదని నాని ఒకడే రావాలని తాను ఒక్కడినే వస్తానని ఇద్దరం కూర్చుని చర్చిద్దామన్నారు. 2019 నుంచి 24 వరకు టిడిపి నాయకులు కార్యకర్తలపై లెక్కలేనన్ని అక్రమ కేసులు పెట్టారని యార్లగడ్డ తెలిపారు. తాను ఎన్నికల ప్రచారంలో గన్నవరంలో అక్రమ కేసులు ఉండవని ప్రకటించానని ఆ మేరకు కట్టుబడి ఉన్నానని తాను అధికారం చేపట్టిన తర్వాత ఇప్పటివరకు ఒక్క అక్రమ కేసు కూడా పెట్టలేదని తేల్చి చెప్పారు. పేర్ని నాని అక్రమ కేసులు అంటూ బకాయిస్తున్న కేసులు వైసీపీ అధికారంలో ఉండగా పెట్టినవేనని గుర్తు చేశారు. 2019 ఎన్నికల్లో నకిలీ ఇళ్ల పట్టాలు పంచితే వైసీపీ నాయకులు డాక్టర్ దుట్టా రామచంద్రరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు అయిందని తెలిపారు. ఇదే అంశం పై 2019లో వైసీపీ ప్రభుత్వంలో పేర్ని నాని మంత్రిగా వున్నప్పుడు తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసారని చెప్పారు. టిడిపి ఆఫీస్ పై దాడి కేసు పెట్టినప్పుడు తాను ఏ పార్టీలో ఉన్నానో గుర్తులేదా అని సూటి గా ప్రశ్నించారు. టిడిపి ఆఫీస్ పై దాడి జరిగింది నిజామా కాదా అన్న ఆయన ఈ సంఘటన జరిగినప్పుడు కనీసం మీరు ఖండించారా అని ప్రశ్నల వర్షం కురిపించారు. అప్పట్లో వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి పైన, ఆయన భార్య పైన కేసులు పెట్టింది ఎవరో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసు అన్నారు. పవన్ను, చంద్రబాబు, లోకేష్ ను నాని తరచూ విమర్శించడం వల్ల రాష్ట్రానికి ఏమైనా ప్రయోజనం ఉందా అని మండిపడ్డారు. మీ తండ్రి పేర్ని కృష్ణమూర్తి ఎంతో గౌరవంగా హుందాగా బతికారని ఆయన పేరు చెడగొట్టొద్దని హితవు పలికారు. పేర్ని నాని, గుడివాడ మాజీ ఎమ్మెల్యే నాని తెలుగు భాషని అగౌరప రిస్తున్నారని వీరిద్దరూ భాష మార్చుకోవాలని హితవు పలికారు. లోకేష్ విమర్శించే అర్హత పేర్ని కి లేదన్న యార్లగడ్డ టిసిఎస్ ద్వారా రాష్ట్రంలోని యువత కు 10 వేల ఉద్యోగాలు, కాగ్నిజెంట్ కంపెనీ నుంచి 8,000 ఉద్యోగాలు, తెచ్చి ఏరో స్పేస్ ని ఆంధ్రకు తీసుకవచ్చినందుకు లోకేష్ ని తిడుతున్నారా అని నిలదీశారు. హైదరాబాదు నుంచి ప్రతి ఏటా రూ.2 లక్షల కోట్లు ఐటి ఎగుమతులు జరుగుతున్నాయంటే అది చంద్రబా బు చలవే అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న చంద్రబాబును విమర్శించడం దారుణం అన్నారు. నానీలిద్దరూ తెలుగు భాషను బూతులతో కూని చేస్తున్నారని మండి పడ్డారు. బూతులు మాట్లాడే నాయకులకు తెలుగు భాష నేర్పాలని సూచించారు. విధానపరమైన విమర్శలు ఉండాలే తప్ప వ్యక్తిగత విమర్శలు ఉండకూడదన్నారు. కేడిసిసి బ్యాంక్ చైర్మన్గా అయిదు వేల కోట్ల టర్నోవర్ ను ఎనిమిది వేల కోట్లకు తీసుకెళ్లి, రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినందుకు బహుమానంగా తన పదవి తొలగించారని పేర్కొన్నారు. తెలుగు భాషను బూతులతో మనుగడ కోల్పోయేలా చేస్తున్నారని భాషను కోల్పోయిన రోజున జెంటిల్మెన్ అనరని, డాబర్మాన్ అంటారని ఆవేదన వ్యక్తం చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ ఇదే భాషను వైసీపీ నాయకులు కొనసాగిస్తే పార్టీ మనగడే ప్రశ్నార్థకం అవుతుందని హెచ్చరించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచడమే లక్ష్యం

- ప్రభుత్వ పాఠశాలల ముందు ప్రవేశాలు ముగిశాయి అనే బోర్డులు ఉండాలి
- ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్య అందిస్తారని తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించాలి
- పెనమలూరు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు దుర్గా భవానిని 'షైనింగ్ టీచర్' పేరుతో ఘనంగా సత్కరించిన మంత్రి లోకేష్
- అద్భుత పనితీరుతో ఆదర్శంగా నిలిచారని ప్రశంసించిన మంత్రి



**ఉండవల్లి(జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత పెంచి తద్వారా ప్రవేశాలు పెంచడమే తమ లక్ష్యమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. తన నిబద్ధతతో కృష్ణా జిల్లా పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అద్భుత ఫలితాలు సాధించిన ప్రధానోపాధ్యాయురాలు యలమంచిలి దుర్గా భవానిని 'షైనింగ్ టీచర్' పేరుతో ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మా లక్ష్యం ఒక్కటే, వచ్చే నాలుగేళ్లలో ప్రైవేటు స్కూల్స్ అడ్మిషన్లు తగ్గాలి. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరగాలి. ప్రభుత్వ పాఠశాలల ముందు అడ్మిషన్స్ క్లోజ్డ్ అని బోర్డులు ఉండాలనేదే మా లక్ష్యం. అప్పుడే ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్య అందిస్తారని తల్లిదండ్రులు నమ్ముతారు. అప్పుడే మనం నిజంగా సాధించినవారమవుతాం. ఇందుకోసం చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు.

**విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దుర్గా భవాని కృషి**

కృష్ణా జిల్లా పెనమలూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలిగా గత ఐదేళ్లు పనిచేసిన యలమంచిలి దుర్గాభవాని వృత్తి పట్ల నిబద్ధత చూపి విద్యార్థులను సమున్నతంగా తీర్చిదిద్దారు. 2025 ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో 54 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. ఏడుగురు విద్యార్థులు ప్రతిష్టాత్మక ఐఐఐటీల్లో ప్రవేశాలు పొందారు. వరుసగా మూడేళ్ల పాటు పదుల సంఖ్యలో విద్యార్థులు ఎన్ఎమ్ఎమ్ స్కాలర్ షిప్ సాధించారు. రాష్ట్రంలో మొదటిసారిగా ప్రభుత్వ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే ఈవెంట్ నిర్వహించారు. పీఎంశ్రీ యోజన పథకం కింద పాఠశాల ఎంపికైంది. కమ్యూనిటీ మొబిలైజేషన్ ద్వారా వాల్ ఆర్ట్స్, డ్యాన్స్, మ్యూజిక్ క్లాస్ లు, కంప్యూటర్ శిక్షణ అందించారు. ఆమె ఆధ్వర్యంలో పాఠశాల వినూత్న ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచింది. అటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా విద్యార్థులు తాము నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలకు వారే వినూత్న పరిష్కారాలు కనుగొంటారు. తడిచిన ధాన్యం ఆరబోసే యంత్రంతో పాటు ఐరెన్ బాక్స్ హీట్ కంట్రోల్ ఇన్ క్లైన్, పాఠశాలలో చెత్తను శుభ్రం చేసేందుకు పాతవస్తువుల నుంచి బ్లోయర్ తయారీ, ఆల్కహాల్ సెన్సింగ్ హెల్మెట్ వంటి నవీన ఆవిష్కరణలను విద్యార్థులు రూపొందించారు.

**ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సలహాలు సూచనలు స్వీకరించిన మంత్రి లోకేష్**

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానోపాధ్యాయురాలు దుర్గా భవాని నుంచి విద్య, ఐటీ శాఖల మంత్రి ఈ సందర్భంగా సలహాలు, సూచనలు స్వీకరించారు. అద్భుతమైన పనితీరుతో ఉపాధ్యాయులందరికీ ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకే ఉపాధ్యాయులను నేరుగా కలవాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. మొదటి ఏడాదిలో సంస్కరణలు చేపట్టామని, అవి అమలయ్యే తీరు క్షేత్రస్థాయిలో పనిచేసే ఉపాధ్యాయులకే తెలుస్తుందన్నారు. ప్రతి విద్యార్థి ముఖ్యమేనని, వచ్చే నాలుగేళ్లు విద్యార్థుల అభ్యసన ఫలితాలపై దృష్టిసారిస్తామన్నారు. ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ (లీప్) ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని, ఇందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారం కావాలని తెలిపారు.

# శంకర్ విలాస్ వంతెన విస్తరణలో భాగంగా పరిహార చెక్కుల పంపిణీ



- ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేతుల మీదుగా ఐదుగురు లబ్ధిదారులకు రూ.25.50 లక్షల చెక్కులు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలో శంకర్ విలాస్ వంతెన విస్తరణ పనుల్లో భాగంగా భూసేకరణకు అంగీకరించిన షాపుల యజమానులకు ప్రభుత్వం నుండి మంజూరైన పరిహారాన్ని శుక్రవారం పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఐదుగురు లబ్ధిదారులకు రూ. 25 లక్షల 50 వేల విలువైన చెక్కులను అందజేశారు. వంతెన విస్తరణకు అవసరమైన భూమిని సమర్పించేందుకు ముందుకు వచ్చిన షాపు యజమానులను ఎమ్మెల్యే మాధవి అభినందించారు. అభివృద్ధి ప్రాజెక్టుల ప్రయోజనాన్ని గుర్తించి ప్రజలు సహకరించడం గర్వకారణమని ఆమె అన్నారు. గుంటూరు నగరానికి అవసరమైన సదుపాయాల కల్పనలో భాగంగా వంతెన విస్తరణ ప్రాజెక్టు కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆమె, భూసేకరణ వల్ల ఉపాధి కోల్పోయిన వారికి న్యాయమైన పరిహారం అందించడం ప్రభుత్వ బాధ్యతగా పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇతర లబ్ధిదారులకు కూడా తగిన నష్టపరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. షాపు యజమానులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం అందించిన పరిహారానికి కృతజ్ఞతలు తెలిపారు. వంతెన విస్తరణ పూర్తయిన తర్వాత ట్రాఫిక్ సమస్యలు తగ్గి, ప్రజలకు ప్రయాణ సౌలభ్యం పెరిగేలా మారుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఫోటో, వీడియోగ్రాఫర్ల వర్క్‌షాప్



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** ఫోటోగ్రాఫర్లు వీడియో గ్రాఫర్లు, ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకునేలా మెలకువలు తెలుసుకునేందుకు వీలుగా, ఏర్పాటు చేసిన వర్క్‌షాప్ నిర్వాహణ తీరు ప్రాధాన్యతను సంతరించుకుంది. స్థానిక ఎన్జీవో కళ్యాణమండపం వేదికగా, తెనాలి ఫోటోగ్రాఫర్స్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కెనాన్ కెమెరాస్,కంపెనీ సౌజన్యంతో ఫోటోగ్రాఫర్లకు వీడియో గ్రాఫర్లకు వర్క్‌షాప్ నిర్వహించారు. కెనాన్ కంపెనీ ఫ్యాకల్టీ, సీనియర్ ఫోటోగ్రాఫర్ దలిశెట్టి రాంబాబు వీడియో ఎడిటింగ్, ఫోటోగ్రఫీలో మెలకువలు, తమదైన శైలిలో వివరించారు. ఫోటోగ్రాఫర్లు వీడియో గ్రాఫర్లు, టెక్నాలజీ పరంగా వారికున్న సమస్యలను నివృత్తి చేసుకున్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాబి మాట్లాడుతూ కెనాన్ కంపెని సౌజన్యంతొ ఏర్పాటు చేసిన వర్క్‌షాప్ కు, తోడ్పాటు అందించిన సంస్థలకు ధన్యవాదాలు తెలిపారు. మిర్రర్ కెమెరాల నుండి, మిర్రర్ లెస్ కెమేరాలు వచ్చాక, వృత్తినైపుణ్యానికి ఉపయోగపడేలా వర్క్‌షాప్ ద్వారా మంచి విషయాలు తెలుసుకున్నామని సభ్యులు, అసోసియేషన్ కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమాన్ని, అసోసియేషన్ అధ్యక్షులు సాంబయ్య, బాబి, సాయి, సునీల్ సందీప్ లు, పర్యవేక్షించారు. పట్టణంలోని పలువురు ఫోటోగ్రాఫర్స్ వీడియో గ్రాఫర్స్ పాల్గొన్నారు.

# 20న ఉచిత మెగా వైద్య శిబిరం



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** చినకాకాని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఈనెల 20వ తేదీన మంగళగిరి శ్రీ సత్య సాయి భజన మండలి ఆధ్వర్యంలో హైదరాబాద్ ఏషియన్ వ్యాస్కులర్ హాస్పిటల్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షులు పూసపాటి సాయి కృష్ణ తెలిపారు. పాఠశాలలో శుక్రవారం ఆయన వైద్య శిబిరానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. వైద్య శిబిరం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు జరుగుతుందన్నారు. శిబిరంలో సాధారణ వ్యాధులు, స్త్రీలకు సంబంధించిన వ్యాధులు, దంత పరీక్షలు, రక్తనాళాలకు సంబంధించిన వైద్య సేవలు అందించబడతాయన్నారు. శిబిరంలో సుమారు ఐదువేల రూపాయల విలువైన రక్తనాళాలకు సంబంధించిన కలర్ డాప్లర్ పరీక్ష ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. గ్రామ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి భజన మండలి కన్వీనర్ డాక్టర్ రాయపాటి రామారావు, హాస్పటల్ మార్కెటింగ్ మేనేజర్ వీ నవీన్ పాల్గొన్నారు.

# గుంటూరు జీజీహెచ్‌లో "మీ కోసం మేము" కార్యక్రమం

- మొబైల్ వినియోగ దుష్పరిణామాలపై అవగాహన




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో శుక్రవారం "మీ కోసం మేము" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ఎస్. ఎస్. వి. రమణ ఆధ్వర్యంలో పేషెంట్–డాక్టర్ ఇంటరాక్షన్ సమావేశంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రేడియాలజీ విభాగ ప్రొఫెసర్ డా. వి. విజయేత మాట్లాడుతూ, ఈమధ్యకాలంలో సెల్‌ఫోన్ల అధిక వినియోగం, ముఖ్యంగా రాత్రిపూట ఫోన్‌లకు అలవాటుపడి పోవడం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాలు చూపుతున్నాయని తెలిపారు. సెల్‌ఫోన్ రేడియేషన్ వల్ల తలెద్దరు, నిద్రలేమి, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు పెరుగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ప్రజల్లో ఈ దుష్పరిణామాలపై అవగాహన కల్పించడం అవసరమని పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రిలో అమలులోకి వచ్చిన కొత్త భద్రతా విధానం (సెక్యూరిటీ పాలసీ)పై సూపరింటెండెంట్ డా. రమణ వివరించారు. ఆసుపత్రిలోకి ప్రవేశించడానికి అటెండర్ పాస్ తప్పనిసరి అని, అత్యవసర సందర్భాల్లో మాత్రమే రోగి బంధువులు ఆసుపత్రిలో ఉండాలని సూచించారు. మత్తు పానీయాలతో ఆసుపత్రిలోకి రావడం నిషేధమని, నూతన నియమావళిని ప్రతి ఒక్కరు గౌరవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాగృతి సేవ సంస్థ తరఫున నాగరాజకుమారి ఉచిత మల్టీవిటమిన్ మందుల పంపిణీ చేశారు.

# జాతీయ స్థాయిలో గుంటూరు నగరపాలక సంస్థకు అత్యుత్తమ అవార్డు

- కలెక్టర్ అభినందన



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** స్వచ్ఛ సర్వేక్షణ్ 2024–25లో గుంటూరు నగరపాలక సంస్థ జాతీయ స్థాయిలో అత్యుత్తమ అవార్డు పొందిన ఘనతపై జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ అభినందనలు తెలిపారు. శుక్రవారం ఆమె క్యాంప్ కార్యాలయంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసులు కలిసి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డ్ మరియు మెమెంటోను కలెక్టర్‌కు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సూపర్ స్వచ్ఛ లీగ్ సిటీస్ కేటగిరీలో దేశవ్యాప్తంగా ఎంపికైన 23 నగరాల్లో గుంటూరు ఒకటిగా నిలవడం గర్వకారణమని అన్నారు. ఈ అవార్డ్‌ను గెలవడంలో మేయర్, కమిషనర్‌ల సారథ్యంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజారోగ్య సిబ్బంది సమిష్టిగా పని చేయడం కీలకమైందని చెప్పారు. జాతీయ స్థాయిలో వచ్చిన ఈ అవార్డు నగర ప్రజలకు మరింత మెరుగైన పారిశుధ్య సదుపాయాలు, ఆరోగ్యవంతమైన వాతావరణం కల్పించేందుకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. అదే విధంగా, "ఒక జిల్లా %–% ఒక ఉత్పత్తి" కేటగిరీలో గుంటూరు మిర్చికి లభించిన జాతీయ అవార్డును కలెక్టర్ స్వీకరించిన సందర్భంలో, కమిషనర్ పులి శ్రీనివాసులు, అదనపు కమిషనర్లు అభినందనలు తెలిపారు.

# ప్రమాదంకరంగా ప్లాస్టిక్ వినియోగం



- కమీషనర్ విఎమ్. లక్ష్మీపతి

తెనాలి 18,(జర్నలిస్ట్ ఫైల్)కాలుష్యాన్ని పెంచే ప్లాస్టిక్ పర్యావరణానికి ప్రమాదకరమని ప్లాస్టిక్ వినియోగం నియంత్రించేందుకు నిర్దిష్టమైన విధానాలు అమలు చేస్తామని మున్సిపల్ కమిషనర్ విఎమ్ లక్ష్మీపతి పేర్కొన్నారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలోని తమ చాంబర్ లొ, శుక్రవారం కమిషనర్ వి లక్ష్మీపతి మీడియాతో మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల అంతులేని కాలుష్యం ఏర్పడుతుందని, ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించే దిశగా ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు., శనివారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫంక్షన్ హాల్స్, హొటల్స్, ఫంక్షన్లో జరిగే ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించే దిశగా గతానికి భిన్నంగా నిర్దిష్టమైన విధానాలు అమలు చేస్తామన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల జరిగే నష్టాన్నిగుర్తించి ప్రజలు అవగాహనతో ప్లాస్టిక్ వినియోగాన్ని స్వచ్ఛందంగా నియంత్రించాల్సిన అవసరం ఉందని అన్నారు. అదేవిధంగా బహిరంగ మల మూత్ర విసర్జనా రహిత, పట్టణంగా తెనాలి పురపాలక సంఘం రాష్ట్ర స్థాయిలొ 2024 సంవత్సరానికి 27,వ ర్యాంక్ సాధించగా, జాతీయ స్థాయిలొ 547వ, ర్యాంక్ లభించినట్లు కమిషనర్ లక్ష్మీపతి వివరించారు.

# పారదర్శకంగా బంగారు కుటుంబాలు ఎంపిక



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా జీరో పావర్టీ పి 4 కు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని కాకుమాను ఎంపిడిఓ కే. యుగ కీర్తి తెలిపారు. మండల పరిధిలోని కొండపాటూరు, పెద్దివారిపాలెం గ్రామాలలో పి 4 గ్రామ సభలను ఎంపిడిఓ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా ఎంపిడిఓ యుగ కీర్తి మాట్లాడుతూ బంగారు కుటుంబాలు కు సంబంధించి గతంలో జరిగిన సర్వే కు సంబంధించి రీ వెరిఫికేషన్ అర్హుల ఎంపిక వంటి పలు అంశాల గూర్చి గ్రామ ప్రజలతో చర్చించారు. ఈ సందర్భంగా వచ్చిన పలు అర్జీ దారులతో సమస్యల గూర్చి అడిగి తెలుసుకున్నారు. అందరి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అర్హత కలిగిన వారికి తప్పనిసరిగా పి 4 ద్వారా వారి ఆర్థిక ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమం లో ఈ ఓ పి ఆర్ డి రవి బాబు, సర్పంచ్ వై. సుజాత, సెక్రటరీ రామకృష్ణ రెడ్డి, దానయ్య, ఫణీంద్ర, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి రహితుడు, అభివృద్ధి ప్రధాత పెమ్మసాని చంద్రశేఖర్

- జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** అవినీతి రహితునిగా, అభివృద్ధి ప్రధాతగా పేరుగాంచిన గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ను ఈనెల 18వ తేదీన వారి నివాసంలో జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, శారదానికేతన్ సెక్రటరీ జి. శ్రీనివాసరావు లు కలిసి శారదానికేతన్ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు హాజరు కావలసిందిగా ఆహ్వానించారు. 1922 లో స్వాతంత్ర సమర యోధులు ఉన్నవ లక్ష్మీనారాయణ, ఉన్నవ లక్ష్మీబాయమ్మ దంపతులు బాలికల విద్యను పెంపొందించడానికి గుంటూరులో 2/14 బ్రాడీపేటలో దాదాపు మూడు ఎకరాల విస్తీర్ణంలో శ్రీ శారదానికేతన్ స్థాపించారని, ఎంతోమంది దాతల సహకారంతో శ్రీ శారదా నికేతన్ అభివృద్ధి చెంది నేడు దాదాపు 500 మంది విద్యార్థినులకు ఉచితంగా విద్యతో పాటు భోజన వసతిని కల్పిస్తూ వేలాది మంది విద్యార్థులకు తోడ్పాటు అందిస్తుందని పెమ్మసాని చంద్రశేఖర్ కు వివరించారు. మహాత్మా గాంధీజీ, వి.వి. గిరి, సి. రాజగోపాలచారి లాంటి ప్రముఖులు శ్రీ శారదానికేతన్ సందర్శించినారని వివరించారు. కందుకూరి వీరేశలింగం ప్రోత్సాహంతో ఉన్నవ లక్ష్మీనారాయణ దంపతులు వితంతు వివాహాలను ప్రోత్సహించి నిర్వహించినారని, బాల్య వివాహాల నిరోధానికి కృషి చేశారని తెలిపారు. స్వాతంత్ర సమరయోధులు ప్రముఖ న్యాయవాది ఉన్నవ లక్ష్మీనారాయణ రచించిన మాలపల్లె నవల తెలుగు ప్రజలలో స్వాతంత్ర ఉద్యమాన్ని ప్రేరేపించిందని అంటరానితనము లాంటి సమస్యను ప్రజల ముందు ఉంచిందని తెలిపారు. శ్రీ శారదానికేతన్ లో ఎలిమెంటరీ స్కూలు, హై స్కూలు తోపాటు ఓరియంటల్ కళాశాలలు నిర్వహిస్తున్నారని, బిఏ లో తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు, కంప్యూటర్ విజ్ఞానాన్ని నేర్పిస్తున్నారని వివరించారు. తరగతి గదులు కొరతగా ఉండటం వలన గుంటూరు నగరంలో దాతల సహకారంతో 4 తరగతి గదులను నిర్మించ తలపెట్టినామని ఆగష్టు 13 తర్వాత శంకుస్థాపనకు హాజరు కావలసిందిగా పెమ్మసాని చంద్రశేఖర్ ను కోరారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ ప్రసంగిస్తూ దాతల సహకారంతో విద్యాలయాల అభివృద్ధికి కృషి జరగాలన్నారు. 103 సంవత్సరాల క్రితం ప్రారంభించిన శ్రీ శారదానికేతన్ వేలాదిమంది పేద బాలికలకు విద్యతోపాటు, భోజన వసతి ఉచితంగా కల్పిస్తూ దిగ్విజయంగా కొనసాగుతున్న చారిత్రాత్మకమైన విద్యాలయంగా కొనియాడారు. ఉన్నవ లక్ష్మీనారాయణ దంపతుల కృషిని అభినందించారు. పార్లమెంట్ సమావేశాలు ఆగస్టు 12వ తేదీతో ముగుస్తాయని ఆ అనంతరం తప్పకుండా శ్రీ శారదానికేతన్ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు హాజరవుతానని పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు

## బహిరంగ ప్రకటన

మా క్లయింట్ అయిన గుంటూరు సిటీ, అమరావతి రోడ్, మునుస్వామి నగర్, 4వ లైను, కాపురస్తులైన నూతలపాటి శేఖర్ బాబు గారి కుమారుడు, నూతలపాటి సంజీవరావుగారి నంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింట్ ఈ దిగువ షెడ్యూల్ దాఖల ఆస్తిని గుంటూరు సిటీ, బ్రాడీపేట 2/2వ లైను, డోర్ నెం. 5-3-13/బి కాపురస్తులు లేటు మజుందర్ నాగేశ్వరరావు గారి కుమారుడు 1. మజుందర్ శేషగిరిరావు మరియు డిటో డిటో కాపురస్తులు యలమర్తి రాఘవేంద్రుడు గారి కుమార్తె మరియు మజుందర్ శేషగిరిరావు గారి భార్య అయిన 2. యలమర్తి రమాదేవి వారి నుండి క్రయము పొందుటకు కరారు చేసుకొన్నారు. సదరు ఆస్తి వారి పుర్వార్జితముగా సంక్రమించిన 4.00 సెంట్లు భూమిని శ్రీ నర్సరావుపేట రెవెన్యూడివిజనల్ అధికారిచే Land Conversion (New), G.O. Ms No. 98 రు ప్రకారం Residencial ప్రాంతముగా Conversion చేయబడి సదరు 4.00 సెంట్లు భూమికి రోడ్లు పోగా మిగిలిన భూమిని మేము ఫ్లాట్లుగా విభజించి విక్రయింప చూపగా ఈ దిగువ ఫ్లాట్ల నెంబర్లు 1 నుంచి 17, 25 నుంచి 34, 42,43,46,47,48, 51, 54, 81, 82 మరియు 84 నుంచి 92 ఫ్లాట్లు వెరసి మొత్తం 7,341 గజాల ఆస్తిని ఈ రోజు వరకు సర్వ సంపూర్ణ హక్కులతో సంక్రమింపబడి అనుభవించుచున్న షెడ్యూల్ దకల ఆస్తిని వారి కుటుంబ అవసరాల నిమిత్తం సదరు ఆస్తిని విక్రమమునకు బహిరంగ పరచగా పై తెల్పిన మా క్లయింట్ సదరు ఆస్తిని కొనుగోలు చేయు నిమిత్తం ఖరారు చేసుకొని యున్నారు. సదరు ఆస్తి యందు ఎవరికైన ఎటువంటి అభ్యంతరములుగాని హక్కులు గాని మరియు ఏవిధములైన లావాదేవీలు ఉన్నయడల వారు ఈ ప్రకటన వెలువడిన 15 రోజులలోగా వారి అక్షేపణలు తెలుపుకొనవలసినది. ఈ గడువు కాలములో ఎటువంటి అక్షేపణలు రాని యడల సదరు ఆస్తి నిష్చేచీ బరితము అని భావించి నా క్లయింట్ క్రయము పొందెదరు. మా క్లయింట్ సదరు ఆస్తిని కొనుగోలు చేసిన తరువాత వచ్చే ఏ విధమైన వివాధములు, ఫిర్యాధులు, కోర్టుకేసులు చెల్లనెరవు మరియు అటువంటి వాటికి మా క్లయింట్ బాధ్యులు కారు.

**షెడ్యూల్**

పల్నాడు డి॥ నర్సరావుపేట రి॥డి॥ చిలకలూరిపేట సబ్ డి॥ మైదవోలు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన మైదవోలు గ్రా॥ తా॥ డి. నెం. 392, 393 ర్లు మింజుమలె మాకు హక్కు కలిగిన స్థలమునకు హద్దులు.

తూర్పు : డొంక హద్దు

దక్షిణం : చిల్లరిగె మురళీ హనుమంతరావు, మంజుదార్ వెంకట రామారావు మరియు డొంక హద్దు.

పడమర : చిల్లరిగె మురళీ హనుమంతరావు గారి ఆస్తి హద్దు,

ఉత్తరం : మందలపు రామయ్య వగైరాల ఆస్తి హద్దు

ఈ హద్దుల మద్య గల య. 4.00 సెంట్ల లేక చదరపు గజాలు 19360 ల స్థలములో ప్లాను దాఖలా ఫ్లాట్ నెం. 1 నుంచి 17, 25 నుంచి 34, 42,43,46,47,48, 51, 54, 81, 82 మరియు 84 నుంచి 92 ఫ్లాట్లు వెరసి మొత్తం 7,341 గజాల స్థలము నకు హద్దులు యావద్విశిష్ఠములతో...

**LEELAW ASSOCIATES**
LINGAMALLU RAMESH KUMAR
YAKAMA LEELA PADMAVATHI
ADVOCATES, HIGH COURT OF AP
D.No. 133-6-1402, 7th Line, Reddypalem,
GUNTUR. Cell : 970327366

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# వైసీపీ నేతల బెదిరింపులపై టీడీపీ నేత వర్ల రామయ్య ఆగ్రహం



- చిత్తూరు ఎస్పీపై జగన్ వ్యాఖ్యలు తప్పు - వెంటనే చర్యలు తీసుకోవాలి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ రెడ్డి పోలీసులను బెదిరిస్తున్న తీరును తీవ్రంగా తప్పుపడుతూ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఘాటు వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి పదవిలో ఉండి, పోలీసు అధికారులను బెదిరించడం రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ఎదురుదెబ్బ అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వర్ల రామయ్య మాట్లాడుతూ, ఇటీవల జగన్ చిత్తూరు ఎస్పీపై చేసిన వ్యాఖ్యలు ప్రమాదకరమని చెప్పారు. "రిటైర్ అయినా వదలనని" అన్న జగన్ మాటలు ఒక బాధ్యతగల నేతకు తగవని, అవి పోలీసు వ్యవస్థపై నేరుగా చేసిన బెదిరింపులుగా పరిగణించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. జగన్ వ్యాఖ్యలతో సహా, వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలు పోలీసులను టార్గెట్ చేస్తూ ఎస్పీలపై తప్పుడు ప్రచారాలు చేస్తుండటాన్ని వర్ల రామయ్య తీవ్రంగా ఖండించారు. గొట్టిపాటి వంశీకృష్ణ వంటి వైసీపీ నేతలు సోషల్ మీడియాలో చిత్తూరు ఎస్పీపై అభాసుపాలు చేసేలా పోస్టులు పెడుతున్నారని, వీరిపై వెంటనే కేసులు నమోదు చేసి అరె-స్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులపై ఇలాంటి దుష్ప్రచారాన్ని సహించేది లేదని పేర్కొన్నారు. మద్యం కుంభకోణంపై ప్రభుత్వం వేసిన సిట్ విచారణ ముమ్మరంగా సాగుతుండటంతో, దాన్ని దారి మళ్లించేందుకు వైసీపీ నేతలు పోలీసులను లక్ష్యంగా చేసుకుని దుష్ప్రచారం ప్రారంభించారని వర్ల ఆరోపించారు. గత పాలనలో వైసీపీ మద్యం మాఫియా కొనసాగిందని, ఇప్పుడు దాన్ని విచారణ చేస్తే అసహనం వ్యక్తం చేస్తూ అధికారులను బెదిరించడం దారుణమన్నారు. పోలీసులపై వైసీపీ నేతలు ఇప్పటికే ఎన్నో దుశ్చర్యలకు పాల్పడ్డారన్న వర్ల రామయ్య, గతంలో దళితులపై జరిగిన దాడులపై ప్రభుత్వం స్పందించకపోవడాన్ని గుర్తుచేశారు. డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం, వరప్రసాద్, అబ్దుల్ సలాం వంటి కేసుల్లో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టమైందని ఆరోపించారు. పోలీసులే దాడులు చేసినా, అత్యాచారాలు జరిగినా, ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని అన్నారు. జగన్ చేసిన వ్యాఖ్యలన్నీ పోలీసు అధికారుల స్వతంత్రతను, ఆత్మగౌరవాన్ని దిగజార్చేలా ఉన్నాయని వర్ల విమర్శించారు. "నీవు ఎవరు ఎస్పీకి సినిమా చూపించడానికి? నువ్వు కొట్టేసిన డబ్బుతో తీసిన సినిమాలా?" అంటూ ఆయన ఎద్దేవా చేశారు. ఆ ఎస్పీకి ఇంకా 25 ఏళ్ల సర్వీసు ఉందని, డీజీ హోదాకి చేరే అవకాశం ఉన్నప్పటికీ జగన్ మాత్రం జైలు గడపక తప్పదని పేర్కొన్నారు. ఈ సందర్భంలో ప్రజలు, మీడియా పోలీసు వ్యవస్థపై జరుగుతున్న దాడులను గమనించి స్పందించాలని వర్ల రామయ్య విజ్ఞప్తి చేశారు. జగన్ నాయకత్వం వైసీపీని ఫ్యాక్షన్ గుంపుగా మార్చిందని, ప్రజాస్వామ్యానికి ఇది ప్రమాదకరమని తీవ్ర హెచ్చరిక ఇచ్చారు.

## అంతర్ జిల్లా బదిలీలు వెంటనే చేపట్టాలి
### ప్రభుత్వాన్ని కోరిన తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయులకు తక్షణం అంతర జిల్లా బదిలీలు నిర్వహించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఇప్పటికే రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు అన్ని రకాల బదిలీలు జరిపిన నేపథ్యంలో, అంతర జిల్లాల బదిలీలను కూడా ఆలస్యం చేయకుండా చేపట్టాలని సూచించింది. తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వర్లు కలిసి విడుదల చేసిన ప్రకటనలో, చాలా సంవత్సరాలుగా అంతర జిల్లా బదిలీలు జరగలేదని పేర్కొన్నారు. భార్యభర్తలు ఉపాధ్యాయులుగా వేర్వేరు జిల్లాల్లో పనిచేస్తూ, తమ పిల్లలు, తల్లిదండ్రుల నుంచి వేరుగా ఉండే పరిస్థితి ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా చేపట్టనున్న మెగా డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాలకు ముందు, ప్రస్తుతంగా విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు మానవతా దృష్టితో బదిలీ అవకాశం కల్పించాలని ప్రభుత్వం కోరారు. ఇదే సమయంలో, ఈ బదిలీలు జరిగితే కుటుంబ సమైక్యత కాపాడడమే కాకుండా, శిక్షణా నాణ్యత మెరుగవుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ విషయంలో సానుకూలంగా స్పందించి, ఉపాధ్యాయుల క్షేమం దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని సంఘం పిలుపునిచ్చింది.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ డే నిర్వహణపై ఏపీ జేఏసీ అమరావతి హర్షం

- ప్రభుత్వ ఉత్తర్వులపై సీఎం సహా అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన బొప్పరాజు వెంకటేశ్వర్లు

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా "గ్రీవెన్స్ డే" నిర్వహణపై ప్రభుత్వం పునరుద్ధరించిన ఉత్తర్వులపై ఆంధ్రప్రదేశ్ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరి జనరల్ పలిశెట్టి దామోదరరావు హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఇచ్చిన జీవో మేరకు మూడవ శుక్రవారం జరగాల్సిన గ్రీవెన్స్ డేలు చాలాచోట్ల నిర్వహించకపోవడంతో, ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఏపీ జేఏసీ అమరావతి కృషికి తగిన ఫలితం లభించింది. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల పట్ల జరిగిన నిర్లక్ష్యానికి ప్రతిగా ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 92 రోజుల పాటు ఉద్యమం కొనసాగింది. దాని ప్రభావంతో 2023 జూన్ 24న ప్రభుత్వం జీవో నంబరు 1233 జారీ చేసి, ప్రతి నెల మూడవ శుక్రవారం అన్ని శాఖల్లో గ్రీవెన్స్ డే నిర్వహించాలనే ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అన్ని జిల్లాల్లో ఈ ఉత్తర్వులు పూర్తిగా అమలుకావడం లేదని జేఏసీ గుర్తించింది. ఈ నేపథ్యంలో 2024 డిసెంబర్ 5న ముఖ్యమంత్రి కార్యాలయ ప్రధాన కార్యదర్శికి ఏపీ జేఏసీ చేసిన విన్నపానికి స్పందనగా, 2025 జనవరి 6న సీఎంపీ నోట్ ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయం ప్రధాన కార్యదర్శి, జీఏడీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని సూచించింది. ఈ మేరకు 2025 జూలై 6న జీఏడీ మెమో నంబరు %౼ూణూ1/ూౖూణ-వీణూ/4/2025-ూౖ% ద్వారా జిల్లా కలెక్టర్లు, అన్ని శాఖాధిపతులకు ఆదేశాలు జారీ అయ్యాయి. గత జీవో నంబరు 1233, తేదీ 24.06.2023లో పేర్కొన్న విధంగా ప్రతి మూడవ శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించాల్సిందిగా, కాలపరిమితిలో ఉద్యోగుల ఫిర్యాదులను పరిష్కరించాల్సిందిగా, ప్రతి రెండు వారాలకు ఒకసారి సమీక్షించాల్సిందిగా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సర్వీసుల విభాగాధిపతి శంషేర్ సింగ్ రావత్‌కు ఏపీ జేఏసీ అమరావతి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఆదేశాలను కఠినంగా అమలు చేయాలని, గ్రీవెన్స్ డేలను శాఖాధిపతులు మరియు కలెక్టర్ స్థాయిలలో విజయవంతంగా నిర్వహించాలని జేఏసీ పిలుపునిచ్చింది.

# విద్యుత్ తయారీ సంస్థలు గ్రీన్ హైడ్రోజన్‌పై దృష్టి

- తక్కువ ఖర్చుతో హరిత ఇంధనం ఉత్పత్తి చేయాలి
- గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ లో సీఎం చంద్రబాబునాయుడు పిలుపు
- రెండు హరిత ఇంధనం తయారీ కంపెనీలతో ఎంవోయూ




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** గ్లోబల్ వార్మింగ్ కారణంగా గ్రీన్ హైడ్రోజన్ కు ప్రాముఖ్యత పెరిగిందనీ, విద్యుత్ తయారీ సంస్థలు హరిత ఇంధనం తయారీ, నిల్వలపై దృష్టి సారించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. నీరుకొండలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం జాతీయ స్థాయి గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్-2025 జరిగింది. ముఖ్య అతిధిగా హాజరైన సీఎం చంద్రబాబునాయుడు సదస్సును ప్రారంభించి పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలు, గ్రీన్ హైడ్రోజన్‌పై పరిశోధనలు చేస్తోన్న నిపుణుల నుద్దేశించి ప్రసంగించారు. వాతావరణాన్ని కలుషితం చేస్తున్న శిలాజ ఇందనాలకు ప్రత్యామ్నాయం గ్రీన్ హైడ్రోజన్ గా పేర్కొంటూ తక్కువ ఖర్చుతో హరిత ఇందనం తయారీ విరివిగా జరగాలని సూచించారు. ప్రధాన మంత్రి మోదీ 2030 నాటికి 500 గిగావాట్ల నాన్ ఫాజిల్ ఫ్యుయల్ ఎనర్జీని ఉత్పత్తి చేయాలనీ, లక్ష్యాలు నిర్దేశించిన నేపథ్యంలో విద్యుత్ తయారీ సంస్థలు, పరిశోధకులు, పెట్టుబడి దారులు గ్రీన్ హైడ్రోజన్ పై దృష్టి సారించాల్సి ఉందన్నారు. సోలార్, విండ్ పవర్లను కూడా పెంచాలని సూచిస్తూ.. గ్రీన్ హైడ్రోజన్ సదస్సును ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఎం యూనివర్సిటీ యాజమాన్యాన్ని సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ పి సత్యనారాయణన్ స్వాగతోపన్యాసం చేస్తూ గ్రీన్ హైడ్రోజన్ పై పరిశోదనలతో పాటు ఉత్పత్తికి ముందుకు వచ్చే పరిశ్రమలకు సాంకేతిక సహకారం అందించేందుకు ఎస్ఆర్ఎం వర్సిటీ సిద్ధంగా ఉందన్నారు. నీతి ఆయోగ్ మెంబర్ డాక్టర్ వీకే సాదస్వత్ మాట్లాడుతూ, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి కేంద్రం లక్ష్యాలను నిర్దేశించి నిధుల కేటాయింపు జరిపిందన్నారు.. గ్రీన్ హైడ్రోజన్ తయారీ, నిల్వలకు దోహదపడే సంస్థలకు కేంద్రం వివిధ రూపాల్లో సహకారం అందిస్తుందన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, హరిత ఇంధనం తయారీ విషయంలో మన దేశం అగ్రదేశాలతో పోటీ పడాల్సి ఉందన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెద్ద ఎత్తున పెట్టుబడులతో ముందుకు రావాలని కోరారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆచార్య డి నారాయణరావు మాట్లాడుతూ, ప్రభుత్వ సహకారం యూనివర్శిటీలో ఇన్నోవేషన్ సెంటర్ను ప్రారంభించనున్నామనీ, భవిష్యత్లో హైడ్రోజన్ పవర్ ట్రైన్, కార్లను అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు.

అనంతరం ఎమ్ను, జేకే ఎస్ హెచ్, హిమ్న కంపెనీలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కుదుర్చుకున్న రెండు ఎంవోయూ పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. ప్రభుత్వం తరపున సీఎం చంద్రబాబునాయుడు, రెన్యూవబుల్ ఎనర్జీ కార్పొరేషన్ ఎండీ కమలాకర్ బాబులు పత్రాలను అందుకోగా ఆయా కంపెనీ. ప్రతినిధి గాల్ బాగిన్ ఎంవోయూ పత్రాలను స్వీకరించారు. మచిలీపట్నం కృష్ణపట్నంల మధ్య ఏర్పాటు చేయనున్న ఈ రెండు ప్రాజెక్టుల వల్ల 10 వేల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని అంచనా వేశారు.

సదస్సుకు ఆరగంట ముందు సీఎం చంద్రబాబునాయుడు వివిధ పరిశ్రమం మేనేజింగ్ డైరెక్టర్లతో ప్రత్యేకంగా సమావేశమై గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, అనుకూల పరిస్థితులు, అవసరమైన సహకారం పై చర్చించారు.

అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్ ఘనంగా సత్కరించి జ్ఞాపికను ప్రదానం చేశారు.

సీఎం చంద్రబాబు నీతి అయోగ్ మెంబర్ డాక్టర్ వీరే సారస్వతు. కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసానీలను సత్కరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, యూనివర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ సతీష్ కుమార్, సినర్జన్ గ్రీన్ ఎనర్జీ కంపెనీ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రణవ్ తంతి, సీఎస్ ఐఆర్ డైరెక్టర్ ఆశిష్ లేలే, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ, సబ్ కలెక్టర్ సంజన తదితరులు పాల్గొన్నారు.

## ఒప్పంద ఉద్యోగుల సమస్యలపై మంత్రి లోకేష్‌కు వినతిపత్రం

- వినతిపత్రం సమర్పించిన జేఏసీ నేతలు
- పిడిఎఫ్ టీచర్స్ ఎమ్మెల్సీ బి. గోపి మూర్తి సమక్షంలో ముఖ్యమంత్రిను కలిసిన ప్రతినిధులు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ మరియు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ & ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (జేఏసీ) ప్రతినిధులు మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. పిడిఎఫ్ టీచర్స్ ఎమ్మెల్సీ బి. గోపి మూర్తి సమక్షంలో ఈ భేటీ జరిగింది. ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రాన్ని సీఎం కు సమర్పించారు. వీరిలో జేఏసీ చైర్మన్ ఎ.వి. నాగేశ్వరరావు, కో-చైర్మన్ బి. కాంతారావు (ఇండివర), ఖజానాదారు డి. దయామణి పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు అనేక శాఖల్లో సేవలందిస్తుండగా, వారిని పర్మినెంట్ చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కనిపిస్తోందని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాల్లో స్పష్టత లేకపోవడంతో వారి భవిష్యత్తు అనిశ్చితంగా మారిందని పేర్కొన్నారు. వినతిపత్రంలో ఉద్యోగులకు సేవా భద్రత కల్పించేందుకు ప్రత్యేక జీవో జారీ చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవలకు సంబంధించి గతంలో తీసుకున్న కీలక నిర్ణయాలను కొనసాగించాలని కోరారు. అలాగే, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు, ఇతర హక్కులు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. జేఏసీ ప్రతినిధులు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కమిషన్, కమిటీ లేదా డైరెక్ట్ రెగ్యులర్ ప్రక్రియను ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలపై సీఎం లోకేష్ చిత్తశుద్ధితో స్పందించారని, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు ప్రభుత్వ స్పందన పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, తమ పోరాటం ఉద్యోగుల హక్కుల సాధన కోసం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## రామాలయం పునః నిర్మాణానికి మంత్రి లోకేష్ రూ.5 లక్షలు విరాళం

- మంత్రి నారా లోకేష్ పంపించిన రూ. 5లక్షలను దేవస్థానం కమిటీకి అందజేసిన నాయకులు
- మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలియజేసిన 20వ వార్డు ప్రజలు, కమిటీ సభ్యులు



**మంగళగిరి టౌన్:** మంగళగిరి 20వ వార్డు కుప్పురావు కాలనీలో పునః నిర్మిస్తున్న హనుమత్ లక్ష్మణ సీతా సమేత శ్రీ రాములవార్ల దేవస్థానమునకు మంత్రి నారా లోకేష్ రూ. 5 లక్షల విరాళం అందజేశారు. మంత్రి నారా లోకేష్ పంపించిన రూ. 5 లక్షల విరాళాన్ని స్థానిక నాయకులు శుక్రవారం కమిటీ సభ్యులకు అందజేశారు. దేవస్థానం పునః నిర్మాణానికి సహకరిస్తున్న మంత్రి నారా లోకేష్ కు 20 వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య మాట్లాడుతూ శ్రీ రాములవార్ల కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని, ఆ స్వామి యొక్క ఆశీస్సులు ఎల్లప్పుడు మంత్రి నారా లోకేష్‌కు ఉండాలని కోరారు. భవిష్యత్ తరాలకు ఆధ్యాత్మిక శక్తిని అందించేందుకు మంత్రి నారా లోకేష్ ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా దేవస్థానంకు విరాళం ఇవ్వడంతో పాటు అవసరమైన కొంత స్థలంను కూడా సమకూర్చడం జరిగిందన్నారు. శ్రీ రాములవార్ల దేవస్థానం నిర్మాణానికి ప్రజలు, భక్తులు తమ వంతు సహాయ సహకారాలు అందించి ఆలయ నిర్మాణంలో పాత్రులు కావాలని కోరారు. శ్రీ రాములవార్ల దేవస్థానం పునః నిర్మాణానికి శ్రీకారం చుట్టిన సభ్యులందరినీ ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, మంగళగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నాయకులు వాసా పద్మ, తిరువీధుల సతీష్, జంజనం వెంకట సుబ్బారావు, దామర్ల బిక్షారావు, చిన్నం శ్రీనివాసరావు, గుంటి మోహన్, బత్తుల శ్రీను, జంజనం సాంబశివరావు, దేవస్థానం కమిటీ అధ్యక్షులు మునగాల వెంకట రత్నం, ఉపాధ్యక్షులు కొల్లి హనుమంతురావు, ప్రధాన కార్యదర్శి బిట్రా దుర్గారావు, సహాయ కార్యదర్శి బట్టు మోహన్, సభ్యులు అడిగోపుల లక్ష్మిరామ్ కుమార్, జొన్నాదుల అశోక్, గోర్రె దుర్గారావు, కొల్లి సాయి, బోడ్డు గోవర్ధన్, దామర్ల వీరాస్వామి, ఇమ్మంది ఆదినారాయణ, దామర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిపై అక్రమ కేసులు



- ఒకే రోజు.. ఒకటే కార్యక్రమం.. మూడు పోలీస్ స్టేషన్‌లలో నమోదు
- సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరైన లేళ్ళ అప్పిరెడ్డి

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ రెంటపాళ్ళ పర్యటన నేపథ్యంలో శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డిపై వరుస అక్రమ కేసులు నమోదయ్యాయి. ఒకే రోజు.. ఒకటే కార్యక్రమం.. కానీ చిత్రంగా మూడు వేరువేరు పోలీసు స్టేషన్లలో అక్రమంగా కేసులు కట్టారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించారనీ.. అనుమతి లేకుండా జన సమీకరణ చేశారనీ.. గుంటూరు నగరం పాలెం పోలీస్ స్టేషన్‌లో తొలుత కేసు నమోదైంది. తర్వాత వీటికి అదనంగా డీజే ఏర్పాటు అంశాన్ని కూడా జోడించి సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదు చేశారు. తాజాగా ఇవే ఆరోపణలతో సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో మూడో కేసు ఫైల్ చేశారు.

ఈ అసత్య ఆరోపణలతో జూన్ 21వ తేదీన గుంటూరు నగరం పాలెం పోలీసులు మొదట ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డికి 41 నోటీసు అందజేశారు. అనంతరం సత్తెనపల్లి పట్టణ పోలీసులు ఇచ్చిన నోటీసులకు అనుగుణంగా ఆయన ఈ నెల 11వ తేదీన సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. అయితే ఆ సందర్భంలో 41 నోటీసు ఇచ్చి పంపించేశారు కానీ.. ఎక్కడా కూడా రెండో కేసు అంశం అసలు ప్రస్తావనకే రాలేదు. మరి తర్వాత ఏం జరిగిందో ఏమో తాజాగా సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో రెండో కేసు నమోదు చేసి హడావుడిగా మళ్ళీ నోటీసులు జారీ చేశారు.

ఈ నేపథ్యంలో శుక్రవారం సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌కు ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి విచారణ నిమిత్తం హాజరయ్యారు. అయితే ఒకే రోజు ఒకే విషయంపై మూడు వేరువేరు పోలీస్ స్టేషన్‌లలో అక్రమంగా కేసు నమోదు చేయడం ప్రస్తుతం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇది చాలా విడ్డూరంగానూ.. కక్షపూరితంగానూ.. ఉందని పలువురు ప్రజాస్వామ్యవాదులు ఖండిస్తున్నారు.

# బీసీ, ఓసీ, మైనారిటీ ఉద్యోగులు చేసిన పాపం ఏంటి

- పదోన్నతుల్లో ఎందుకింత అన్యాయం ?
- హైకోర్టు ఆదేశాల ప్రకారం న్యాయం చేయాలంటూ విజ్ఞప్తి
- మంత్రుల కమిటీ సమావేశంలో సమస్యలపై నివేదించిన ఈక్వాలిటీ ఫోరం, ఏపీ సెక్రటేరియట్ బీసి ఓసీ ఉద్యోగ సంఘాలు

ప్రతిభతో పనిచేస్తున్నా ... మెరిట్ ఉన్నా... అనుభవం ఉన్నా... పదోన్నతికి మాత్రం దూరంగా ఉండే దుస్థితి. ఇది ఏపీ సచివాలయంలో పనిచేస్తున్న బీసీ, ఓసీ, మైనారిటీ వర్గాలను కలచివేస్తూ, కుంగుబాటుకు గురిచేస్తున్న ఆవేదన. బీసీ, ఓసీ, మైనారిటీ వర్గాల ఉద్యోగులకు. పదోన్నతుల్లో అన్యాయానికి లోనవుతున్నామన్న బాధ, హక్కుగా దక్కాల్సిన అవకాశాలు కోల్పోతున్న వేదన %-% ఈ రెండు భావాలు ఈ వర్గ ఉద్యోగులను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయి.

ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ పేరుతో నియమాలు అతిక్రమిస్తూ అధికంగా పదోన్నతులు ఇచ్చి, ఇతర వర్గాల ఉద్యోగుల అర్హతలను తాకట్టు పెడుతున్న ప్రభుత్వ తీరుతో వారిలో తీవ్ర అసంతృప్తి, మానసిక వేదన పెరిగిపోతోంది. ఏపీ సచివాలయంలో పనిచేస్తున్న అనేకమంది బీసీ, ఓసీ, మైనారిటీ వర్గాల ఉద్యోగులు పదోన్నతుల విషయంలో తీవ్ర నిరాశతో, న్యాయవాదనతో, చివరకు ఉద్యమ పంథాలోకి వెళ్తున్నారు. అనుభవం, అర్హత, సామర్థ్యం ఉన్నా - పదోన్నతుల ప్రక్రియలో వారికి న్యాయం జరగడం లేదు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల అమలులో ప్రభుత్వాలు అత్యుత్సాహంతో నిబంధనలు అతిక్రమిస్తూ, ఇతర వర్గాలకు సంబంధించిన అవకాశాలను కోల్పోస్తున్నాయని వారు వాపోతున్నారు.

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న బీసీ, ఓసీ, మైనారిటీ ఉద్యోగులకు పదోన్నతుల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని, హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అల్ ఇండియా ఈక్వాలిటీ ఫోరం పాటు పలు ఉద్యోగ సంఘాలు మంత్రుల కమిటీకి వినతిపత్రాలు సమర్పించాయి. శుక్రవారం సచివాలయంలో గ్రూప్ ఆఫ్ మినిస్టర్ల సమావేశం జరిగింది. ప్రమోషన్లలో రిజర్వేషన్లపై ఉన్నత స్థాయి కమిటీ (ఐఏఎస్ అధికారుల కమిటీ) ఇచ్చిన నివేదికపై సమీక్షించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ, రెవెన్యూ, సివిల్ సప్లయిస్, వైద్య ఆరోగ్య మంత్రులు పాల్గొన్నారు. వీరికి ఆలిండియా ఈక్వాలిటీ ఫోరం, సెక్రటేరియట్ బీసీ, ఓసీ ఎంప్లాయిస్ అసోసియేషన్, మైనారిటీ ఉద్యోగ సంఘాలు పదోన్నతుల్లో జరుగుతున్న అన్యాయంపై వివరంగా నివేదిక సమర్పించాయి. ఈ సందర్భంలో వారు వెల్లడించిన వివరాల ప్రకారం %-16(4ూ%) అధికరణ కింద ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ అమలు చేయడంలో నిబంధనలు పాటించకుండా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. సుప్రీంకోర్టు ఇచ్చిన ఎం.నాగరాజు (2006) తీర్పు ప్రకారం పరిపాలనా సామర్థ్యానికి భంగం కలగకుండా, క్రిమిలేయర్ మినహాయింపు వంటి అంశాలన్నీ తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంది. కానీ ఆచరణలో ఆ నియమాలను అతిక్రమించి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు అధిక శాతం ప్రమోషన్లు పొందుతున్నారు.

వాస్తవంగా రాష్ట్ర సచివాలయం వంటి కీలక స్థాయిలో మిడ్ లెవెల్ ఆఫీసర్స్ స్థాయి పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రాతినిధ్యం భారీగా పెరిగిందని సంఘాలు ఆరోపించాయి. ఉదాహరణకు, 2020 నాటికి అడిషనల్ సెక్రటరీ పోస్టుల్లో ఎస్సీ/ఎస్టీ ప్రాతినిధ్యం 78 శాతానికి చేరింది. మెరిట్‌లో ఉన్నప్పటికీ బీసీ, ఓసీ, మైనారిటీ ఉద్యోగులు పదోన్నతులు పొందలేక కిందిస్థాయి పోస్టుల్లోనే రిటైర్ అవుతున్నారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు, హైకోర్టులు ఇప్పటికే స్పష్టమైన తీర్పులు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలో జాప్యం చేస్తోందని, 2018లో హైకోర్టు తీర్పు మేరకు పదోన్నతులను సమీక్షించాలని చెప్పినా కార్యాచరణ ముందుకు సాగడం లేదని ఉద్యోగ సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి. తెలంగాణ సెక్రటేరియట్లో హైకోర్టు ఆదేశాలు అమలయ్యాయని, అదే విధంగా ఏపీలో కూడా తక్షణం న్యాయం చేయాలని వారు కోరారు. ఇప్పటికే నియమితమైన రెండు కమిటీల నివేదికలు, న్యాయ శాఖ, అడ్వొకేట్ జనరల్ అభిప్రాయాలు హైకోర్టుకు సమర్పించబడ్డాయి. అయినప్పటికీ ప్రభుత్వం మరోసారి జీఓ ఆర్టీ. 1190 ద్వారా మంత్రుల కమిటీ(జీఓఎం) ఏర్పాటు చేయడం వల్ల ఆలస్యం జరుగుతోందని ఉద్యోగ సంఘాలు పేర్కొన్నాయి. ఈ పరిస్థితుల్లో తక్షణమే హైకోర్టు ఆదేశాల మేరకు 'ఆర్.ఓ.ఆర్' ఆధారంగా ఇచ్చిన ప్రమోషన్లను సమీక్షించి, బీసీ, ఓసీ, మైనారిటీ ఉద్యోగులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. మునుపెన్నడూ లేని మెజారిటీతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వ హయాంలోనైనా తమకు న్యాయం జరగాలని వారు విన్నవించారు. బీసీ, ఓసీ, మైనారిటీ వర్గాల ఉద్యోగులు మిడ్‌లెవెల్ స్థాయికి కూడా ఎదగలేక, చిన్న స్థాయి పోస్టుల్లోనే పదవీ విరమణ చెందాల్సిన పరిస్థితి నెలకొంది. దీనివల్ల ఉద్యోగ భద్రతపై అసంతృప్తి, మానసిక వేదన, న్యాయపరమైన పోరాటాల బాటపట్టే పరిస్థితి తలెత్తింది. న్యాయస్థానాలు పలుమార్లు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా నిర్లక్ష్యం చూపుతోంది. ఇప్పుడు హైకోర్టు ఆదేశాల మేరకు 'ఆర్.ఓ.ఆర్' ఆధారంగా సమీక్షించి, పదోన్నతుల్లో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఈక్వాలిటీ ఫోరం సెక్రటరీ కె .శ్రీనివాస్ , సెక్రటేరియట్ బిసి, ఓసి సెక్రటేరియట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తరఫున బి అప్పారావు ,కె రాజేష్ ,ప్రసాద్ , మైనారిటి సంఘాల తరఫున హాక్,దాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467